మత్తు వదలరా..!



‘మత్తు వదలరా..
నిద్దుర మత్తు వదలరా..!
ఆ మత్తులోన పడితే..
గమ్మత్తుగ చిత్తవుదువురా..’
అంటూ.. నిద్ర మేల్కొలుపుతాడు
శ్రీకృష్ణ పరమాత్ముడు..!

నిద్రమత్తులో పడితేనే చిత్తయితే.. ఇక గంజాయి మత్తులో పడితే పరిస్థితి ఏమిటి..? అందులోనూ.. భావి పౌరులు, యువత ఆ మత్తుకు బానిసలైతే దేశ భవిష్యత్తు ఏమిటి..? చూడటానికి మనూరి సందులోనో.. గొందులోనో ఒకరిద్దరు మత్తుగా కనిపిస్తారు. కానీ ఊరిలో చాలా సందులే ఉంటాయి. ఊరూరా సందుగొందులు ఉంటాయి. మొత్తం మత్తు సర్వత్రా కమ్ముకుని ఉంటుంది. 'అపాయమ్ము దాటడానికుపాయమ్ము కావాలి. అంధకారమలమినపుడు వెలుతురికై వెతకాలి..' అని కూడా శ్రీకృష్ణుడే చెప్పాడు. ఆ వెలుతురు పోలీసులే..! మత్తు వదలాల్సింది.. వదిలించాల్సిందీ వారే..! ఇన్నాళ్లూ మురికి వాడలకు, నగర శివార్లకు పరిమితమైన మత్తు.. ఇప్పుడు బడిలో, కాలేజీలో చొరబడింది. బయటకు కనిపించకపోయినా.. కఠోర వాస్తవం ఇది.

యథేచ్ఛగా గంజాయి రవాణా

- మన్యం నుంచి జిల్లాకు మత్తు
- బాలలతో తెప్పిస్తున్న ముఠాలు
- మూడు నెలల క్రితం తునిలో ఒకరి అరెస్టు
- మరో బాలుడు, పెద్దమనిషి పాత్ర
- పోలీసుల నిర్లక్ష్యమా..? ఒప్పందమా..?

అనంతపురం క్రైం, అక్టోబరు 19: ఉండూరు నుంచి దూరంగా ఉండే సిటీల్లో చదివించాలంటేనే తల్లిదండ్రులు ఆందోళన చెందుతారు. అంత దూరమా..? అని ఆవేదన చెందుతారు. సెలవులకు ఇంటికి ఒంటరిగా వస్తున్నా, ఇంటి నుంచి తిరిగి కాలేజీకి వెళుతున్నా.. గమ్యం చేరేదాకా ఫోన్ చేస్తూనే ఉంటారు. కానీ నిండా పదహారేళ్ల లేని బాలలు వందల కి.మీ. నిర్భయంగా ప్రయాణిస్తున్నారు. చదువుల కోసం కాదు..! అసాంఘిక కార్యకలాపాల కోసం..! ఎక్కడ అనంతపురం.. ఎక్కడ అనకాపల్లి..! సుమారు 800 కి.మీ. దూరం..! అక్కడికి రైల్లో గంజాయి తెస్తున్న ఓ బాలుడిని తుని పోలీసులు అరెస్టు చేశారు. నర్సీపట్నం ప్రాంతంలో గంజాయి సేకరించి అనంతపురానికి తరలిస్తున్నట్లు గుర్తించారు. బాలుడి నుంచి 4.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో గంజాయి వినియోగం బీడీ, సిగరెట్ కంటే దారుణంగా విస్తరిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్లు, మురికి వాడలు, రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లు.. ఇలా ఎక్కడ చూసినా గంజాయి వినియోగదారులు కనిపిస్తున్నారు. కొన్ని ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థల వద్ద, మురికి వాడల సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల వద్ద ముళ్ల పొదలు, డ్రైనేజీ కాలువల పరిసర ప్రాంతాలు వీరికి అడ్డాగా మారాయి.

ముఠా ఎక్కడ?

తుని పోలీసులు జూలైలో 16 ఏళ్ల బాలుడిని పట్టుకున్నారు. అతడి వద్ద నాలుగు కిలోలకు పైగా గంజాయిని చూసి అవాక్కయ్యారు. అనంతపురం తరలిస్తున్నట్లు తెలుసుకుని మరిన్ని కోణాల్లో విచారించారు. ఆ బాలుడు అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందినవాడని తేలింది. ఆ బాలున్ని గంజాయి కోసం ఇద్దరు పంపించినట్లు గుర్తించారు. దర్యాప్తు కోసం త్రీటౌన్ పోలీసుల సాయం తీసుకున్నారు. వారిని పంపిన ఇద్దరిలో ఒకరు 17 సంవత్సరాలు దాటిన బాలుడని తెలిసి పోలీసులు అవాక్కయ్యారు. 'మరో పెద్దమనిషి కోసం వస్తాం' అని చెప్పి వెళ్లిన తుని పోలీసులు.. ఆ పెద్దమనిషి ఎవరో ఇక్కడికి పోలీసులకు చెప్పలేదని సమాచారం. ఆ తరువాత పురోగతి లేదు. తుని పోలీసులు ఆ కేసును అక్కడితో వదిలేశారా..? దర్యాప్తు కొనసాగిస్తున్నారా..? తెలియడం లేదు. బాలల చేత గంజాయి దందా నడిపిస్తున్న ముఠా ఆనవాళ్లు జిల్లా కేంద్రంలోనే ఉన్నాయని స్పష్టంగా అర్థమౌతోంది. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదు. తుని పోలీసులకు పట్టుబడిన బాలుడి వివరాల ఆధారంగా లోతుగా దర్యాప్తు చేయవచ్చు. ఇక్కడి పోలీసులే గంజాయి ముఠా అంతు తేల్చవచ్చు. జిల్లాలో కొన్నేళ్లుగా జరుగుతున్న ఘర్షణలు, హత్యలు, రోడ్డు ప్రమాదాలకు గంజాయి కూడా ఒక కారణమని పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. ఎన్నికల ముందు ఎస్పీగా పనిచేసిన అన్బురాజన్.. గంజాయిని అరికట్టడంపై దృష్టి సారిస్తానని చెప్పారు. కానీ ఫలితం లేకపోయింది.

భారీగా వినియోగం...

అనంతపురం నగర శివారు ప్రాంతాల్లో గంజాయిని బహిరంగంగా విక్రయిస్తున్నారు. మత్తుకు బానిసలైన వారిని లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సిగరెట్లలో పొగాకు బదులుగా గంజాయి కలిపి గుట్టుగా అమ్ముతున్నారు. గడిచిన ఐదేళ్లలో గంజాయి వినియోగం భారీగా పెరిగింది. జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు, మారుమూల గ్రామాలకు సైతం ఈ మత్తు పదార్థం సరఫరా అవుతోంది. దూరప్రాంతాల నుంచి తక్కువ ధరకు తెప్పించి.. గ్రాముల ప్రకారం భారీ ధరకు విక్రయిస్తున్నారు. చదువురానివారు, అసాంఘిక శక్తులు గతంలో ఈ దందాలో భాగమయ్యేవారు. కానీ ప్రస్తుతం ఎంబీఏ, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు కూడా ఈ ఊబిలోకి దిగారు. ఇదొక వ్యాపారం, ఉపాధి అన్నట్లుగా చూస్తున్నారు. వీధి బాలలు, పాఠశాల విద్యార్థులను గంజాయికి బానిసలుగా మారుస్తున్నారు. వీరిచేత రవాణా కూడా చేయిస్తున్నారు. అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో గంజాయి రవాణా, విక్రయాలు భారీగా విస్తరించాయి. అనంతపురం నగరంలో కొన్ని ప్రాంతాల్లో గంజాయిని ప్రత్యేకంగా తెప్పించే ముఠా ఒకటి ఉందని సమాచారం. ఎనిమిది నెలల క్రితం వన్‌టౌన్ పోలీసులు ఒకసారి గంజాయిని పట్టుకున్నారు. ఆ తరువాత ఒక్కరినీ పట్టుకున్న ఆనవాళ్లు లేవు. చాప కింద నీరులా విస్తరిస్తున్న గంజాయిని కట్టడం చేయడంలో పోలీసుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది అలసత్వమా..? కొందరి అవినీతా..? అన్నది ఉన్నతాధికారుల జోక్యంతోనే తేలుతుంది.



ఆగస్టు 6న పామిడి పోలీసులు అరెస్టు చేసిన గంజాయి విక్రేతలు, స్వాధీనం చేసుకున్న గంజాయి

మత్తులో నగరం

నిర్జన ప్రదేశాలు, మురికి వాడల్లో మత్తుకు బానిస అయినవారు తిష్ట వేస్తున్నారు. గంజాయి చిల్లర విక్రయాలు ఈ ప్రాంతాల్లోనే ఎక్కువగా సాగుతున్నట్లు కనిపిస్తోంది. అనంతపురం సర్వజన వైద్యశాల వెనుకవైపు, నాయక్ నగర్ రైల్వే గేట్ సమీపంలోని ముళ్ల పొదలు, కృపానంద నగర్, నవోదయ కాలనీ, షికారి కాలనీ, రుద్రంపేట శివారు ప్రాంతాలు, బళ్లారి బైపాస్ శివారు ప్రాం తాలు, తపోవనం బ్రిడ్జి కింద నుంచి నగర శివారు వరకూ చాలాచోట్ల మత్తు పదార్థాలను వాడేవారు కనిపిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోనూ గంజా యి వినియోగం ఎక్కువగా ఉంటోంది. గౌరీ థియేటర్ సమీపంలోని సందులో, పాతూరులోని కొన్ని కాలనీలు, భవానీ నగర్, ఎన్టీఆర్ మార్గ్‌లో రాత్రి 12 గంటల వరకూ గంజాయి బృందాలు సంచరిస్తుంటాయి. పాతూరులో కొన్ని గొడవలు, హత్యలకు గంజాయే ప్రధాన కారణమని పోలీసులకు తెలుసు.

వైజాగ్ ఏజెన్సీ నుంచే...

ఉమ్మడి జిల్లాకు గంజాయి సరఫరా అవతున్నది విశాఖపట్నం సమీపంలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచే. ఇక్కడి ముఠాలు గంజాయి కోసం కొందరిని అక్కడికి పంపుతున్నాయి. అలా వెళ్లి గంజాయి తెచ్చేవారిలో బాలలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 50 గ్రాముల గంజాయి ధర రూ.300 పలుకుతోందని సమాచారం. అనంతపురం నగరంలో కొందరు మహిళలు కూడా ఈ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఆగస్టు 7న పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. విశాఖ నుంచి కారులో గంజాయి తీసుకొచ్చి అనంతపురం, గుంతకల్లు ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా వారిని పట్టుకున్నారు. వారి నుంచి 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వ్యవసాయం, ఇతరత్రా పనులద్వారా వచ్చే ఆదాయం జల్సాలకు సరిపోక పోవడంతో గంజాయి వ్యాపారంలోకి దిగినట్లు పోలీసులు గుర్తించారు.



ఆగస్టు 20న గోరంట్ల పోలీసులు అరెస్టు చేసిన గంజాయి ముఠా, స్వాధీనం చేసుకున్న గంజాయి

పోలీసులకు తెలుసా?

గంజాయి రవాణా, విక్రయం జిల్లాలో బాగా పెరిగింది. అనంతపురం శివారు ప్రాంతాలు, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా గంజాయి విక్రయాలు, వినియోగం జరుగుతోంది. గంజాయిని ఎక్కడి నుంచి తెస్తున్నారు..?, ఎక్కడెక్కడ, ఎంతకు అమ్ముతున్నారు..? అనే వివరాలు కొందరు పోలీసులకు తెలుసని అంటున్నారు. ముఠా సభ్యుల వివరాలు కూడా పోలీసులకు తెలుసనే అంటున్నారు. అయినా పట్టుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ముస్లింల పక్షపాతి చంద్రబాబు

ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫి



చంద్రన్న మదరసా నవీన విద్యాపథకంపై హర్షం వ్యక్తం చేస్తున్న ముస్లింలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింల పక్షపాతి అని, ముస్లింల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి అన్నారు. చంద్రన్న మదరసా నవీన విద్యా పథకం అమలుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. డ్రైవర్స్ కాలనీలోని సబేలుల్ మువిునీన్ మదరసా వద్ద మదరసా విద్యార్థులు, మతపెద్దలతో శనివారం సమావేశం నిర్వహించారు. వైసీపీ హయాంలో మదరసాలు మూసివేసే పరిస్థితుల్లో ఉండగా, టీడీపీ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. ఒక్కో మదరసాకు ముగ్గురు విద్యా వలంటీర్లు చొప్పున మొత్తం 555 మంది నియామకానికి ప్రతిపాదన సిద్ధం చేయడం హర్షనీయమని అన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలల్లో టీచర్ల నియామకం సహా అనేక సంక్షేమ కార్యక్రమాలను అడగకనే టీడీపీ ప్రభుత్వం చేపడుతోందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు తాజుద్దీన్, షౌకత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయమై పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తమ పట్ల సీకేపల్లి ఎస్‌ఐ సత్యనారాయణ దురుసుగా ప్రవర్తించారని మేడాపురం గ్రామానికి చెందిన పసల వంశీకిరణ్ ఆరోపించారు. ఈ మేరకు జాతీయ మానవహక్కుల కమిషన్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. తన చిన్నాన్న ఆదిశేషయ్య, విక్రమ్ అనే వ్యక్తి మధ్య సెప్టెంబరు 27న ఘర్షణ జరిగిందని ఆయన తెలిపారు. విక్రమ్, అతని బంధువులు దాడి చేశారని తన చిన్నాన్న పోలీసులకు ఫిర్యాదు చేశారని, పోలీసులు విక్రమ్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారని తెలిపారు. కేసు పురోగతి గురించి తెలుసుకునేందుకు తన చిన్నాన్నతో కలిసి శనివారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని, ఆ సమయంలో ఎస్‌ఐ తన చిన్నాన్నను దూషించారని, దురుసుగా వ్యవహరించాడని వంశీకిరణ్ అన్నారు. ప్రశ్నించినందుకు తన పట్ల కూడా అదేరీతిలో వ్యవహరించారని అన్నారు. దీంతో తాను ఎస్‌ఐపై జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశానని వంశీకిరణ్ తెలిపారు. తాను ఎవరిపట్లా దురుసుగా వ్యవహరించలేదని, కేసు విషయమై చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

పార్టీ జిల్లా ఇన్‌చార్జి నరసింహులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి నరసింహులు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పార్టీ జిల్లా ఇన్‌చార్జి నరసింహులు అన్నారు. పార్టీకి పూర్వ వైభవం వస్తుందని, కార్యకర్తలు, నాయకులు అధైర్యపడవద్దని సూచించారు. డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తలు, నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్నవి కుటుంబ పార్టీలు అని విమర్శించారు. బీజేపీ దేశాన్ని లూటీ చేస్తోందని, ఆ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూతురు షర్మిలా రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పీసీసీ అధ్యక్షురాలిగా ఆమె పార్టీ కోసం ఎంతో కష్టపడి పని చేస్తున్నారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేలా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ భవనంపై నిర్మించిన అతిథి గృహ ప్రారంభోత్సవానికి షర్మిలతోపాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిద్దామని పీసీసీ ఉపాధ్యక్షుడు కోటా సత్యం అన్నారు. కాంగ్రెస్ పార్టీలో నాయకులు కొదవలేదని, పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా రఘువీరారెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శంకర్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రభాకర్, నాగిరెడ్డి, రాంభూపాల్, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం: ఏఎస్పీ

అనంతపురం క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని ఏఎస్పీ(అడ్మిన్) డీవీ రమణమూర్తి అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆయన అన్నారు. జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదేశాల మేరకు శనివారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో అమరవీరుల కుటుంబాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రయోజనాలు, కారుణ్య నియామకాలు, కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. సమస్యలుంటే తమ దృష్టి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, ఆర్ఐ మధు, ఆర్ఎస్ఐ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ డీవీ రమణమూర్తి

లింగ నిర్ధారణ చట్ట విరుద్ధం

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గర్భంలో ఉన్నది ఆడ శిశువైనా, మగ శిశువైనా.. బయటకు చెప్పడం నేరమని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి అన్నారు. తన చాంబర్‌లో శనివారం గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం గురించి జిల్లా కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేయకుండా నిత్యం నిఘా ఉంచాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమని, అయినా కొన్నిచోట్ల ఇలాంటి స్కానింగ్ పరీక్షలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. అనుమానం ఉన్న స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై నిఘా వేయాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తేలితే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని, డాక్టర్లు, టెక్నీషియన్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయించి జైలుకు పంపుతామని హెచ్చరించారు. లింగ వివక్ష సరికాదని, కొడుకు, కూతురు సమానమేనని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో లింగనిర్ధారణ, బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆర్బీటీ వైద్యులు దుర్గేష్, ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ యుగంధర్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ రేణుక, డాక్టర్ రవికుమార్, డాక్టర్ లక్ష్మిదేవి, డెమోలు త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



కూడేరు మండలం కొర్రకోడులో దెబ్బతిన్న ద్రాక్ష పంట

పంటలకు వాన దెబ్బ

- ఉద్యాన రైతులకు రూ.96.37 లక్షల నష్టం
- ఇళ్లలోకి నీరు.. పలుచోట్ల కూలిన మిద్దెలు



బీకేఎస్ మండలం సిద్ధరాంపురంలో నీట మునిగిన మిరప పంట

అనంతపురం అర్బన్/క్రైం/గుత్తి/కంబదూరు/రాయదుర్గం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలలోకి నీరు చేరింది. జనశక్తి నగర్, ఎంజీఎం కాలనీలలో అర్ధరాత్రి ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలోని 25 మండలాల్లో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. అనంతపురం నగరంలో 64.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. బుక్కరాయసముద్రం మండలంలో 53.0, గార్లదిన్నె 46.6, బొమ్మనహాళ్ 26.0, పెద్దవడుగూరు 24.6, ఉరవకొండ 21.6, నార్పల 17.8, కూడేరు 12.4, పామిడి 12.2, శింగనమల 12.0, డి.హిరేహాల్ 11.0, రాప్తాడు 8.0, ఆత్మకూరు 7.2, వజ్రకరూరు 6.4, గుంతకల్లు, యాడికి 5.2, శెట్టూరు 5.0, గుత్తి 4.6, బ్రహ్మసముద్రం 4.0, గుమ్మఘట్ట 2.8, యల్లనూరు 2.4, రాయదుర్గం 2.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 1.4 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పలు మండలాల్లో శనివారం చిన్నపాటి వర్షం కురిసింది. జిల్లాలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి 60.40 హెక్టార్లలో రూ.96.37 లక్షల విలువైన మిరప, టమోటా, ద్రాక్ష, కాకర, చీనీ పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు విన్నవించారు.

కూలిన మిద్దెలు

గుత్తి ఆర్ఎస్ రవూఫ్ మకాన్ దర్గా రోడ్డు సాదక్‌వలి, అల్లాబకాష్ కుటుంబాలు ఉంటున్న రెండు ఇళ్ల పైకప్పులు శుక్రవారం రాత్రి కూలిపోయాయి. మట్టి మిద్దెలు కావడంతో వరుస వర్షాలకు నెమ్మెక్కి కూలిపోయాయి. ఇళ్లలో సామగ్రి ధ్వంసమైంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతూ తహసీల్దారు ఓబులేసుకు బాధితులు విన్నవించారు.



గుత్తిఆర్ఎస్‌లో కూలిన ఇంటి పైకప్పు

- అనంతపురం నగరంలోని అంబారపు వీధిలో ఓ ఇంటి ముందు భాగం శుక్రవారం రాత్రి కూలిపోయింది. ఆ ఇంట్లో లక్ష్మీదేవి అనే మహిళ తన కూతురు, మనవడితో కలిసి ఉంటున్నారు. గోడలు బయటివైపు కూలడంతో ప్రమాదం తప్పింది. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు మాజీ కార్పొరేటర్ సుజాతమ్మ బాధితులకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, బియ్యం అందజేశారు.



అనంతపురం అంబారపు వీధిలో కూలిన ఇంటి ముందు భాగం

- కంబదూరు మండలం జెల్లిపల్లిలో సునీతమ్మ, అక్కులప్ప దంపతుల ఇళ్లు శుక్రవారం అర్ధరాత్రి కూలిపోయింది. ఆ సమయంలో పక్క గదిలో నిద్రలో ఉన్న దంపతులు.. శబ్దానికి నిద్రలేచి భయంతో బయటకు పరుగులు తీశారు. అధికారులు తమకు పక్కా గృహాన్ని మంజూరు చేయాలని బాధిత కుటుంబం కోరింది.



జెల్లిపల్లిలో కుప్పకూలిన ఇంటి పైకప్పు

- రాయదుర్గం మండలంలోని 74-ఉడేగోళంలో చింతమాన్ల శ్రీనివాసులు ఇల్లు శుక్రవారం అర్ధరాత్రి కూలిపోయింది. కూలిన గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టీవీ, గ్యాస్ స్టవ్ దెబ్బతిన్నాయి. నిత్యావసర సరుకులు పాడైపోయాయి. గ్రామ కార్యదర్శి వెంకటరాముడు, వీఆర్వోలు ఇంటిని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.





ఉడేగోళంలో కూలిన మిద్దె, పరిశీలిస్తున్న అధికారులు

సంక్షిప్తం

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

అధికారులకు మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక రాంనగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఐదు మండలాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ, చెరువుల అంశాలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మురళీధర్‌రావు, డీఈ సఫ్రీన్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ నాగరాజ, ఈఈలు పాల్గొన్నారు.

10 నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

అనంతపురం టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నవంబరు 10 నుంచి 15వరకు కడప డీఎస్ఏ స్టేడియంలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నారని, జిల్లా అభ్యర్థులు హాజరుకావాలని కలెక్టరు వినోద్‌కుమార్ సూచించారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్ ఆఫీస్ అసిస్టెంట్స్, స్టోర్ కీపర్ టెక్నికల్స్, అగ్నివీర్ 10వ తరగతి ట్రేడ్‌మెన్, 8వ తరగతి ట్రేడ్‌మెన్‌కు రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణత ధ్రువ పత్రాలు, అడ్మిట్‌కార్డులు తీసుకుని ర్యాలీలో పాల్గొవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి, అర్హత గలవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హంద్రీనీవా ఎస్ఈగా నాగరాజ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ప్రాజెక్ట్ ఎస్ఈగా నాగరాజ నియమితులయ్యారు. జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈగా ఉన్న నాగరాజకు హంద్రీనీవా ఎస్ఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకు ఎస్ఈగా ఉన్న దేసేనాయక్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఆయన ఆదివారం రిలీవ్ కానున్నారు. సోమవారం హంద్రీనీవా ఇన్‌చార్జి ఎస్ఈగా నాగరాజ బాధ్యతలు తీసుకుంటారు. హంద్రీనీవా డివిజన్-7 ఈఈగా డీఈ శ్రీనివాసులుకు, పెనుకొండ ఐబీ డివిజన్ ఈఈగా రాధాకృష్ణ, కదిరి డివిజన్ 11 ఈఈగా గంగాధర్‌ను నియమించారు.

గుంతకల్లు-చిగ్జాజుర్ ప్యాసింజరు రద్దు

గుంతకల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిగ్జాజుర్-గుంతకల్లు-చిగ్జాజుర్ ప్యాసింజరు (07585/86) రైలును డిసెంబరు రెండో వారం వరకూ రద్దుపరచనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హుబ్లీ రైల్వే డివిజన్‌లోని చిత్రదుర్గ-బేలేనహళ్లి సెక్షన్‌లో జరుగుతున్న పనుల కారణంగా అక్టోబరు 20 నుంచి డిసెంబరు 13వ తేదీ వరకూ (మధ్యలో కొన్ని తేదీలు మినహా) రద్దుపరచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అక్టోబరు 21, 26, 28, నవంబరు 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30, డిసెంబరు 2, 7, 9 తేదీలలో మినహా మిగతా రోజుల్లో ఈ ప్యాసింజరు రైలును రద్దుపరిచామన్నారు.

లా కోర్సు కౌన్సెలింగ్ నిర్వహించాలి

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : లా కోర్సు ప్రవేశాల కౌన్సెలింగ్‌ను త్వరితగతిన నిర్వహించాలని నేచురల్ జస్టిస్ లీగల్ ఎయిడెడ్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనితను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆ సంఘం సభ్యులు పణిభూషణ, చంద్రబాస్కర్ మాట్లాడుతూ అడకమిక్ క్యాలెండర్ మేరకు గత నాలుగు సంవత్సరాలుగా న్యాయ విద్య ప్రవేశాలు కల్పించడంలేదన్నారు. అడ్మిషన్స్ ప్రక్రియ ఆలస్యం కావడంతో పాఠ్యాంశాలను తూతూ మంత్రంగా పూర్తిచేసి పరీక్షలు నిర్వహిస్తుండటంతో ఉత్తీర్ణత శాతం గననీయంగా పడిపోతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, జయరాజు, మధు పాల్గొన్నారు.

రీజనల్ కో ఆర్డినేటర్‌గా మిథున్‌రెడ్డి

అనంతపురం క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉమ్మడి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్‌గా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని ఆ పార్టీ నియమించింది. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి అనంతపురం, నెల్లూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా మిథున్‌రెడ్డిని నియమించినట్లు అందులో పేర్కొంది. గతంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రీజనల్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఎన్నికల అనంతరం వైవీ సుబ్బారెడ్డి పేరును ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. చివరికి మిథున్ రెడ్డిని నియమించారు.

కందికి తెగుళ్ల దెబ్బ



పూర్తిగా ఎండిన కంది మొక్కలు

ఉరవకొండ నియోజకవర్గంలోని నల్లరేగడి భూముల రైతులు నిత్యం పప్పుశనగ పంట సాగుచేస్తుంటారు. వర్షాలు, వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టాల పాలవుతుండడంతో ఈసారి చాలా మంది రైతులు పంట మార్పిడి చేసి చూద్దామని కంది పంట సాగుచేశారు. మొదట బాగా పెరిగిన పంటకు పూతదశలో విల్ట్, ఆకుమచ్చ తెగుళ్లు సోకడంతో ఎండిపోతోంది. దీంతో రైతులు మరోసారి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- విడపనకల్లు, ఆంధ్రజ్యోతి)

వందల ఎకరాల్లో ఎండుతున్న పంట

విల్ట్, ఆకుమచ్చ తెగుళ్లతో భారీ నష్టం

అధిక తేమతో కుళ్లుతున్న వేర్లు

ప్రతి ఏటా పప్పుశనగ సాగు చేసే రైతులు ఈసారి ఎక్కువగా కంది పంట సాగు చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, కూడేరు మండలాల్లో గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి కంది వైపు మొగ్గు చూపారు. ఎటు చూసినా కంది పైరు కనిపిస్తోంది. పప్పుశనగపై ఆశలు వదులకుని కందిని సాగు చేస్తే అదికూడా విల్ట్ తెగులుతో ఎండిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కంది పంట సాగు చేసి ఇప్పటికే మూడు నెలలయింది. ప్రస్తుతం పూత దశలో ఉండగా అధిక వర్షాలతో వేర్లు కుళ్లి పోతున్నాయి. ఇది విల్ట్ తెగులు అని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. విడపనకల్లు, వజ్రకరూరు, మండలాల్లో పైరు ఎండి పోతోంది. కొన్ని గ్రామాల్లోని పొలాల్లో సాళ్లకు సాళ్లు కంది మొక్కలు పూర్తిగా ఎండి పోయాయి. మాళాపురం గ్రామం వద్ద రామాంజనేయులు అనే రైతు పొలంలో కందికి విల్ట్ తెగులు సోకి పూత దశలో ఉన్న పంట ఎండి పోయింది. వేర్లు కుళ్లి పోయి మొక్కలు ఎండుతున్నాయి. చీకలగురికి గ్రామంలో హంద్రీనీవా కాలువ వైపు, ఎర్రనేల పొలాల్లోను కంది ఎండి పోతోంది. దీనికి తోడు పచ్చపురుగు ఆశించడంతో మొక్కలకు ఉన్న ఆకులు మొత్తం రంధ్రాలు పడిపోతున్నాయి. వివిధ రకాల రసాయనిక మందులు వాడినా విల్ట్ తెగులు, పచ్చపురుగు తగ్గటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజక వర్గంలో 69,627 వేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. గతంలో మిరప పంటకు విల్ట్ తెగులు సోకి వేల ఎకరాల్లో నష్టాల పాలయ్యారు.

అధిక రసాయనిక ఎరువుల వల్లే తెగుళ్లు

రైతులు తమ పొలాల్లో అధిక రసాయనిక ఎరువులు వాడకం వల్లే విల్ట్ తెగులు సోకుతోంది. పంట సాగుకు ముందు పొలాల్లో పశువుల ఎరువులు వాడడం లేదు. ఈసారి కంది పంటకు సోకిన తెగులును నివారించడం సాధ్యం కాదు. విల్ట్ తెగులు నివారణకు వేసవి సేద్యంలో ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పేడ ఎరువును వాడాలి. టన్ను పేడ ఎరువుకు 10 కిలోల ట్రైకో డెర్మ వెరడిని వాడాలి. ట్రైకో డెర్మవెరడిని పేడ ఎరువులో 21 రోజులు నానబెట్టిన తరువాత పొలంలో చల్లుకోవాలి. వేసవిలో లోతు దుక్కులు చేసుకుంటే వైరస్‌ను నివారించవచ్చు. విల్ట్ తెగులు సోకిన మొక్కలను తొలగించి పొలం గట్లపై వేసి కాల్చి బూడిద చేయాలి. లేదంటే వైరస్ మొత్తం పొలంలోని మొక్కలకు సోకే అవకాశం ఉంది. అధిక దిగుబడులు రావాలని విచ్చలవిడిగా ఎరువులు వాడటం వల్లే పంటలు ఎండుతున్నాయి.

- హెచ్.పెన్నయ్య, మండల వ్యవసాయ అధికారి, విడపనకల్లు

మొక్కలు ఎండి పోతున్నాయి



రెండు ఎకరాల్లో కంది పంట సాగు చేశాను పచ్చపురుగుతో కొంత, విల్ట్ తెగులుతో కొంత ఎండి పోతోంది. ఎన్ని మందులు వాడినా విల్ట్ ఆదుపు కావటంలేదు. చేసేది లేక ఎండిన మొక్కలను తొలగించి పొలం గట్టుకు వేస్తున్నాం. ఇది ఇలాగే ఉంటే ఎకరాలకు ఎకరాలు ఎండిపోయి పూర్తిగా నష్టపోతాం. పంటల బీమా కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఎ. ఓబుళేసు, మాళాపురం



కుళ్లిన వేర్లు



రంధ్రాలు పడిన ఆకులు

పంట మార్చినా నష్టాలే



నేను ఐదెకరాల్లో కంది పంట సాగు చేశాను. వర్షాలు అధికంగా రావటం, తేమ ఎక్కువ కావటంతో పైరు ఎండి పోతోంది. బూడిద తెగులు, విల్ట్ తెగులు అంటున్నారు. గతంలోను మిరప పంటకు విల్ట్ తెగులు సోకి లక్షల్లో నష్టాలు పాలయ్యాం. ఇప్పుడు పంటలను మార్పు చేసి కందిని సాగు చేసినా విల్ట్ వదలటం లేదు. ఎక్కపడితే అక్కడ కంది మొక్కలు ఎండి పోతున్నాయి. ఏమి చేయాలో తెలియడం లేదు.

- జి.విజయ్, వి.కొత్తకోట

ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు



నేను ఎనిమిది ఎకరాల్లో కంది పంటను సాగు చేశాను. నెల రోజుల నుంచి కంది పైరు ఎండుతోంది. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకుండా పోతోంది. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఉన్నట్లుండి ఎండిపోతుండడంతో ఏమి చేయాలో తెలియక అలాగే వదిలేశాను. ప్రతి ఏటా పప్పుశనగ సాగు చేసేవాడిని, ఈసారి పంట మార్పిడి చేస్తే బాగుంటుందని అందరితో పాటు కంది సాగు చేస్తే విల్ట్ తెగులు సోకి ఎండుతోంది.

- ఎం.రామాంజనేయులు, పెద్ద కొట్టాలపల్లి

నిలకడలేని టమోటా ధరలు

ఊరించి ఉసూరుమనిపిస్తున్న వైనం

మొన్నటి వరకు 16 కిలోల బాక్స్ రూ.800 నుంచి రూ.1000

నేడు రూ. 350 నుంచి రూ.400కు పతనం





టమోటాను బాక్సుల్లోకి నింపుతున్న కూలీలు

కళ్యాణదుర్గం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షం దెబ్బకు టమోటా ధరలు ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయి. మొన్నటి వరకు అనంతపురం, కర్ణాటకలోని కోలార్ టమోటా మార్కెట్లలో 16 కిలోల బాక్స్ ధర రూ.800 నుంచి రూ.1000 వరకు పలికాయి. అవే ఇప్పుడు రూ. 350 నుంచి రూ. 400 పడిపోయాయి. ఈ ధరలు ఇంకా తగ్గే అవకాశాలు ఉన్నాయి. వారం రోజుల వ్యవధిలోనే అమాంతంగా ధరలు పడిపోయాయి. ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 390 ఎకరాలకు పైగా టమోటా సాగు చేశారు. ఎకరాకు రూ. లక్ష వరకు ఖర్చు చేసి, ఒక్కొక్క రైతు సరాసరి రెండున్నర ఎకరాలకు పైబడి సాగు చేశారు. టమోటా పంటలన్నీ కోతకు వస్తున్న సమయంలో ఇలా ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి కూడా అమాంతంగా పెరగడంతో మార్కెట్లకు భారీగా టమోటా చేరుతోంది. వర్షం దెబ్బతో బంగ్లాదేశ్‌కు ఎగుమతి నిలిపివేయడంతోనే ధరలు నిలకడగా ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. టమోటా కొనుగోలుకు మొన్నటి వరకు వ్యాపారులు ఎగబడ్డారు. ధ రలు ఇలాగే ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. వారం రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం తగ్గుముఖం పట్టాయి.



తోటలోనే మాగిపోయిన టమోటా

వారంలోనే తగ్గిన ధరలు



నాకున్న మూడు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశాను. వారం రోజుల క్రితం 16 కిలోల టమోటా బాక్స్ ధర రూ.800 నుంచి రూ.1000 వరకు అమ్ముడుపోయింది. అదే ధర ఇప్పుడు రూ. 350 నుంచి రూ.400కు పడిపోయింది. ఇలా ధర ఒక్కసారిగా పడిపోవడంతో భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నాం.

- నగేష్, కరిగానిపల్లి

వర్షం దెబ్బతోనే పతనం



గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం దెబ్బకు టమోటా ధర పడిపోతోంది. ఈ ధరలు ఇలాగే ఉంటే పెట్టుబడి కూడా రాదు. నాకున్న రెండు ఎకరాల్లో సుమారు రూ. 2 లక్షలు వరకు ఖర్చు చేసి టమోటా పంటను సాగు చేశాను. మొన్నటి వరకు రూ. 800కు పైబడి 16 కిలోల బాక్స్ కొన్నారు. ప్రస్తుతం రూ. 400కు పడిపోయింది. పడిలేస్తున్న ధరలు చూస్తే మాలాంటి చిన్నకారు రైతుల పరిస్థితి ఏమి కావాలో అర్థం కాలేదు.

- హరీష్, కరిగానిపల్లి

యాపారం జోరు..!

అంగన్‌వాడీ పోస్టుల చుట్టూ బేరాలు

రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ

జిల్లా వ్యాప్తంగా 84 పోస్టులు ఖాళీలు

23 నుంచి ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'యాపారం' జోరందుకుంది. ఒక్కో పోస్టు లక్షలు పలుకుతోంది. కొందరు మధ్యవర్తులు, దళారులు అధికార పార్టీ నాయకులు కొందరిని అడ్డుపెట్టుకుని అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు బేర సారాలు ఆడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజెక్టుల్లో 84 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నెల 23 నుంచి అభ్యర్థులకు రెవెన్యూ డివిజన్ల వారీగా ఇంటర్యూలు నిర్వహించనున్నారు. అయితే చాలా చోట్ల అభ్యర్థులకు పోస్టులు ఇప్పిస్తామని మధ్యవర్తులు బేరాలు ఆడుతున్నారు. రూ. 2 లక్షల నుంచి రూ. 5లక్షల వరకూ పోస్టులను, సెంటర్‌ను బట్టి రేట్ ఫిక్స్ చేసి బేరాలు ఆడుతున్నారు. దీంతో పోస్టులు ఏమేరకు పారదర్శకంగా భర్తీ అవుతాయనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

అంగన్‌వాడీ పోస్టులకు 303 దరఖాస్తులు

అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గతనెలలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 1వ తేదీ వరకూ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు 303 దరఖాస్తులు వచ్చాయి. 9 వర్కర్ పోస్టులకు 68 దరఖాస్తులు, నాలుగు మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 11 దరఖాస్తులు, 71 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు 224 దరఖాస్తులు వచ్చాయి. డివిజన్ల వారీగా పరిశీలిస్తే... అనంతపురం డివిజన్‌లో 102 దరఖాస్తులు, గుంతకల్లు డివిజన్‌లో 66 దరఖాస్తులు, కళ్యాణదుర్గం డివిజన్‌లో 56 దరఖాస్తులు వచ్చాయి.

23 నుంచి ఇంటర్వ్యూలు...

అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 23 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అనంతపురం రెవెన్యూ డివిజన్‌పరిధిలోని అభ్యర్థులకు 23న ఉదయం 10 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు చేస్తారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు 24న ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు 25న ఉదయం 10 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచే బేరాలు ఊపందుకున్నాయి. అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు సగటున రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకూ బేరాలు సాగుతున్నాయి. కొన్ని చోట్ల రూ. 5 లక్షలు కూడా పలుకుతోంది. మినీ వర్కర్ పోస్టుకు సైతం రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలు వరకూ నడుస్తోంది. ఆఖరికి ఆయా పోస్టుకు సైతం రూ. 2 లక్షలు, ఆపైన కూడా రేట్ ఫిక్స్ చేసి దళారులు బేరాలు సాగిస్తున్నారు. శింగనమల, తాడిపత్రి, అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, కణేకల్లు, గుత్తి, కంబదూరు, రాయదుర్గం, నార్పల, కళ్యాణదుర్గం ఇలా ప్రతి ప్రాజెక్టు పరిధిలో కొందరు దళారులు, ద్వితీయశ్రేణి నాయకులు కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో సిఫార్సు లెటర్లు ఇప్పిస్తామని, ఐసీడీఎస్ అధికారులకు ఫోన్లు చేయిస్తామని చెప్పి భారీగా బేరాలు సాగిస్తున్నాయి. కొందరు సంఘాల నాయకులు కూడా ఇందులో తలదూర్చి చక్రం తిప్పాలని చూస్తున్నారు. అభ్యర్థుల ఇంటర్వ్యూలకు మరో మూడు రోజులు మాత్రమే సమయం ఉండటంతో...ఈ బేరాలు జోరందుకున్నాయి. మరి అధికారులు ఏ మేరకు పాదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారో? అక్రమాలను ఏ విధంగా కట్టడి చేస్తారో చూడాలి.



ఐసీడీఎస్ పీడీ కార్యాలయం

ప్రాజెక్టుపేరు	పోస్టులు
అనంతపురం అర్బన్	8
శింగనమల	6
నార్పల	9
అనంతపురం రూరల్	10
తాడిపత్రి	14
గుత్తి	5
ఉరవకొండ	12
కళ్యాణదుర్గం	6
కణేకల్లు	5
కంబదూరు	7
రాయదుర్గం	2
మొత్తం 11 ప్రాజెక్టులు	84

ఏసీబీకి ఫిర్యాదు చేయండి

పోస్టులను పారదర్శకంగా భార్తీ చేస్తాం. అభ్యర్థులను ఎవరైనా డబ్బులు అడిగి ప్రలోభ పెడితే వెంటనే ఏసీబీ అధికారులు ఫిర్యాదు చేయండి. అభ్యర్థులు నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదించవచ్చు.

- శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ

చూసొద్దాం రండి..!

డ్యాం చూద్దాం.. చేప తిందాం..



నూరూరించే చేపలు పులుసు, చేపల రోస్ట్

కూడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఒత్తిడితో కూడిన జీవనం నుంచి కాస్త రిలాక్స్ కోసం చాలా మంది ఏదో ఒక పిక్నిక్‌కు వెళ్లాలని భావిస్తుంటారు. అలాంటి వారికి పీఏబీఆర్ డ్యాం మంచి ఆప్షన్‌గా కనిపిస్తోంది. ఇక్కడ నిండుగా కనిపించే నీటిని చూసి పిల్లలు, పెద్దలు ఉల్లాసం పొందుతారు. ముఖ్యంగా ఇక్కడ ఇక్కడ దొరికే చేపలతో తయారు చేసే పులుసు, రోస్టు ఎంతో రుచికరంగా ఉంటుంది. పీఏబీఆర్ డ్యాంలో చేపలను తిన్న వారు ఆ రుచికి ఫిదా అవాల్సిందే. డ్యాంను చూడటానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చేపలతో వివిధ రకాల వంటకాలు తయారు చేయించుకొని అక్కడే ప్రశాంతంగా భోంచేస్తుంటారు. మరికొందరు ఇంటికి పార్సల్ తీసుకెళ్తారు. సెలవు రోజుల్లో డ్యాం వద్దకు పదుల సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాల్లో సందర్శకులు వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడి, పాడి అలసి ఇంటికి వెళ్తుంటారు. మరి కొందరు ఇక్కడే పుట్టినరోజు వేడుకలు సైతం జరుపుకుంటుంటారు. మరి మీకు వెళ్లాలని ఉంటే కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఓ రోజు వెళ్లి సరదాగా గడిపేయండి.



సిద్ధం చేస్తున్న తయారీదారులు

అమ్మపేరుతో మొక్క నాటాలి

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్



మొక్కలు నాటుతున్న సత్యకుమార్ యాదవ్, లాల్‌సింగ్ ఆర్య, గుడిసె దేవానంద్

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన పర్యవరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ వారి అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి పెంచాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'అమ్మ పేరుతో ఒక మొక్క' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మందల శాంతకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మంత్రి సత్యకుమార్ యాదవ్‌తోపాటు జాతీయ దళిత మోర్చా అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య, రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అకాల వర్షాలు తదితర వాటిని నియంత్రించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. స్ఫూర్తిదాయకంగా ప్రధాని మోదీ మొక్కనాటి తన తల్లి హీరాబెన్ పేరును నామకరణం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకేశివశంకర్, జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్, బీజేపీ నాయకులు లలిత్‌కుమార్, సూర్య, నాగేంద్ర, జయలక్ష్మి, రామ్‌దాస్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యలత, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తుంగభద్ర.. నిండు కుండ



నీటితో నిండుగా ఉన్న తుంగభద్ర

బళ్లారి సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతోంది. డ్యాంలో 101.42 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ఎగువ నుంచి 73,241 క్యూసెక్కుల వరద నీరు డ్యాంలోకి చేరుతోంది. దిగువకు 74,025 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో 11వేల క్యూసెక్కుల నీరు కాల్వలకు, 63 వేల క్యూసెక్కుల నీరు నదిలోకి వెళుతోంది. ఇన్‌ఫ్లో పెరిగితే లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు. జలాశయ పరివాహక ప్రాంతాలైన ఆగుంబె, శివమొగ్గ, హొసపేట తదితర చోట్ల వర్షాలు బాగా కురుస్తున్నాయి. గత వారంలో జలాశయానికి ఇన్‌ఫ్లో 84వేల క్యూసెక్కులు ఉండగా ఈవారం తగ్గింది. ఈ సంవత్సరం రెండో పంటకు కూడా నీరు పుష్కలంగా లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఆదుకోండి..!

వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి

- చెరువులకు హంద్రీనీవా నీరు ఇవ్వండి
- ప్రభుత్వానికి జిల్లా పరిషత్ సభ్యుల వినతి
- పింఛన్ల తొలగింపుపై వైసీపీ సభ్యులతో వాగ్వాదం
- కొత్తగా 15 లక్షల పింఛన్లు ఇస్తామన్న మంత్రి సత్యకుమార్
- శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, అధికారుల గైర్హాజరుపై అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం విద్య, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తుఫాను, అధిక వర్షాల కారణంగా పొలాల్లో పంటలు దెబ్బతింటున్నాయని, రైతులను ఆదుకోవాలని జిల్లా పరిషత్ సభ్యులు డిమాండ్ చేశారు. వేరుశనగ, పత్తి, కొర్ర, మిర్చి తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు నష్టపోతున్నారని, వారికి పరిహారం ఇవ్వాలని మంత్రిని, జిల్లా కలెక్టర్‌ను కోరారు. మెజార్టీ చెరువులకు నీరు ఇవ్వాలని కోరారు. పింఛన్ల రద్దు అంశంపై వైసీపీ జడ్పీటీసీలు, మడకశిర ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం జరిగింది. అనర్హుల పింఛన్లను రద్దు చేస్తారని, కూటమి ప్రభుత్వం కొత్తగా 15 లక్షల పై చిలుకు కొత్త పింఛన్లు ఇస్తోందని మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రధానంగా ఈ రెండు అంశాలపై రెండున్నర గంటలపాటు చర్చ సాగింది. చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన 11వ సర్వసభ్య సమావేశం జడ్పీ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. సుమారు గంటన్నర ఆలస్యంగా సభ ప్రారంభమైంది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఇద్దరు ఎమ్మెల్యేలు మినహా, మెజార్టీ ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, జేసీ, వివిధ శాఖల అధికారులలో సగం మంది సభకు రాలేదు. వారిపై చైర్ పర్సన్, మంత్రి అసహనం వ్యక్తం చేశారు. అధికారులందరూ వచ్చే సమావేశానికి హాజరయ్యేలా చూస్తామని సభ్యులకు మంత్రి హామీ ఇచ్చారు.

అన్నదాతలకు ఆసరా..

ఉమ్మడి జిల్లా రైతులు అనేక రకాలుగా నష్టపోతున్నారని జడ్పీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. వర్షాల వల్ల పొలాల్లో పంటలకు మొలకలు వస్తున్నాయని అమడగూరు, గుమ్మఘట్ట, విడపనకల్లు జడ్పీటీసీలు అన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. పరిగి చెరువుకు మరమ్మతులు చేయించాలని ఆ మండల జడ్పీటీసీ కోరారు. కంది విత్తనాలను మోతాదును పెంచాలని యల్లనూరు జడ్పీటీసీ కోరారు. అడవి పందులు, ఇతర జంతువుల నుంచి పంటలకు రక్షణ కల్పించాలని లేపాక్షి జడ్పీటీసీ కోరారు. ఎరువుల కోసం డబ్బులు చెల్లించినా తమ మండలంలో సరఫరా చేయలేదని కంబదూరు జడ్పీటీసీ సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సేవా కేంద్రాల్లో డబ్బులు చెల్లించని అధికారులపై కఠిన చర్యలు జేడీఏని ఆదేశించారు. ఏవో, ఏడీ వెంటనే కంబదూరు మండలంలో పర్యటించి, పరిస్థితిని తనకు తెలియజేయాలని కోరారు. యల్లనూరులో పప్పుశనగ దిగుబడులను కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వడంలేదని, మూడేళ్లుగాను తాను సభ దృష్టికి తెస్తున్నా న్యాయం జరగలేదని జడ్పీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రైతులకు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మార్కెట్ ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతపురం బైపాస్ నుంచి టమోటా మండీలకు వెళ్లే రహదారిలో ట్రాఫిక్ సమస్య ఉందని, కక్కలపల్లికి వెళ్లాలంటే గంట పడుతోందని అనంతపురం రూరల్ జడ్పీటీసీ సభ దృష్టికి తీసుకొచ్చారు. డబుల్ రోడ్డు పనులు వెంటనే జరిగేలా చూడాలని కోరారు. సర్వే నంబర్ 83లో సమాధులను తవ్వేసి కొట్టాలు వేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సిద్దరాంపురం చెరువుకు నీరు ఇవ్వాలని జడ్పీ వైస్ చైర్మన్ నాగరత్న అధికారులను కోరారు.


సభకు హాజరైన సభ్యులు

● అనంతపురం నగరంలోని నడిమివంక, మరువ వంకలో పూడిక తియ్యనందుకే ఏడాదిన్నర క్రితం వరదలు వచ్చాయని, ప్రస్తుతం అన్ని వంకల్లో పూడిక తీస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వంకలకు రక్షణ గోడలను నిర్మించడంపై దృష్టిసారిస్తామని అన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధంపై గ్రామస్థాయి నుంచి కసరత్తు చేయాలని అన్నారు. దీనిపై జడ్పీ పాలకవర్గం తీర్మానం చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. మండలాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని కొందరు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. జడ్పీ చైర్ పర్సన్ కూడా ఇదే అంశంపై పెదవి విరిచారు. ప్రొటోకాల్ పాటించేలా సర్క్యులర్ జారీ చేస్తామని జడ్పీ సీఈఓ అన్నారు.

చెరువులకు నీరివ్వండి..

● హంద్రీనీవా ద్వారా తమ ప్రాంతంలోని చెరువులకు నీరు ఇవ్వాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర కోరారు. 2014-2019 మధ్య చెరువులకు నీరు ఇచ్చారని, ఆ తర్వాత రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలలో చెరువులకు నీరు ఇవ్వాలని, చెరువులకు మరమ్మతులు చేయించాలని కోరారు.

● మడకశిర నియోజకవర్గం సముద్రమట్టానికి చాలా ఎత్తులో ఉందని, తమ ప్రాంత చెరువులకు గత ఐదేళ్లలో చుక్కనీరు ఇవ్వలేదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. తాగునీటి సమస్య కూడా ఉందని, వెంటనే నీరు ఇవ్వాలని అధికారులను కోరారు.

అధికారులు ఎక్కడ..?

● శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారుల గైర్హాజరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీటీసీలు సమస్యలపై ప్రశిస్తే సమాధానం చెప్పడానికి కలెక్టర్, ఉన్నతాధికారులు లేకుంటే ఎలా అని మడకశిర ఎమ్మెల్యే అన్నారు. తాము సభలో ఏం మాట్లాడినా ప్రయోజనం ఉండదని అన్నారు. ఎమ్మెల్యేలు వచ్చినా జిల్లా అధికారులు రాకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఇది ఉమ్మడి జిల్లా జడ్పీ సమావేశమా..? లేక ఒక జిల్లా సమావేశమా..? అని మండిపడ్డారు. అధికారుల తీరుపై చైర్ పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ జిల్లా కలెక్టర్‌తో తాను మాట్లాడుతానని, వచ్చే సమావేశానికి వారం ముందు తన దృష్టికి తీసుకురావాలని జడ్పీ సీఈఓకు అనంత కలెక్టర్ సూచించారు. అధికారులు అందరూ హాజరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

● పీహెచ్‌సీల్లో వైద్యుల కొరతను మెజార్టీ జడ్పీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. బ్రహ్మసముద్రం పీహెచ్‌సీలో నాడు-నేడు పనులపై విచారణ చేయాలని జడ్పీటీసీ కోరారు. నార్పల పీహెచ్‌సీని గైనకాలజిస్టును ఇవ్వాలని జడ్పీటీసీ కోరారు. కొత్త చెరువుకు పీహెచ్‌సీ అవసరం ఉందని, మంజూరు చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర కోరారు. శెట్టూరు, లేపాక్షి జడ్పీటీసీలు పీహెచ్‌సీ సమస్యలను సభదృష్టికి తీసుకొచ్చారు.

పింఛన్లపై రగడ


ఫించన్ల అంశంలో ఎమ్మెల్యే రాజు, వైసీపీ జడ్పీటీసీల మధ్య వాగ్వాదం

కంబదూరు, గుమ్మఘట్ట, యల్లనూరు, అనంతపురం రూరల్, కనగానపల్లి జడ్పీటీసీలు, కొందరు ఎంపీపీలు పింఛన్ల రద్దు గురించి ప్రశ్నించారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కలుగజేసుకుని, అనర్హులవి మాత్రమే తొలగిస్తారని అన్నారు. మూడు నెలలలో 5908 వృద్ధాప్య పింఛన్లు, 519 దివ్యాంగుల పింఛన్లను తొలగించారని చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. ఈ క్రమంలో వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనర్హుల పింఛన్లను తొలగించి, తమ ప్రభుత్వం కొత్తగా 15 లక్షల పింఛన్లు ఇవ్వనుందని ఎమ్మెల్యే అన్నారు. లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చినంత మాత్రాన పింఛన్ రద్దు కాదని, రద్దుకు సహేతుక కారణాలను డీఆర్‌డీఏ, పింఛన్ పంపిణీ అధికారులు (పీడీఓ) లబ్ధిదారులకు వివరించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూండా చూడాలని అధికారులను ఆదేశించారు.

సమస్యలను పరిష్కరిస్తాం: మంత్రి సత్యకుమార్



సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై మంత్రి సత్యకుమార్ స్పందించారు. చెరువులకు నీటి విడుదలపై నీటిపారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయి స్పష్టత ఇవ్వాలని సూచించారు. పీఎంజీఎస్‌వై 3.0 ప్రస్తుతం నడుస్తోందని అన్నారు. గ్రామీణ రహదారులకు కేంద్రం భారీగా నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు గ్రామీణ రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్ కనెక్టివిటీ లేకుండా ఒక్క గ్రామం కూడా ఉండకూడదని అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, అధికారులు గైర్హాజరుపై తాను కూడా విచారిస్తానని, వచ్చే సమావేశానికి హాజరుకావాలని ఆదేశిస్తామని అన్నారు. గత ప్రభుత్వం సర్పంచులకు చెక్ పవర్ లేకుండా చేసిందని, ఈ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతగానో కృషిస్తోందని అన్నారు. గ్రామాలకు రూ.4500 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. పింఛన్లపై తనకూ ఫిర్యాదులు వచ్చాయని, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందుతాయని అన్నారు. కొత్తగా 15 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. పీహెచ్‌సీ సమస్యలపై రీ సర్వే చేయిస్తామని అన్నారు. జనాభా, ఇతర పరిస్థితులను బట్టి పీహెచ్‌సీల మంజూరు, డాక్టర్ల కొరత, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, శ్రీసత్యసాయి జిల్లా డీఆర్వో, ఉమ్మడి జిల్లాలోని పలు శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

బీటీపీకి పెరుగుతున్న వరద


బీటీ ప్రాజెక్టులో నీరు

గుమ్మఘట్ట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భైరవానితిప్ప రిజర్వాయర్‌కు వరదనీరు పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం రెండు టీఎంసీలు (1655 అడుగులు). కాగా శనివారం సాయంత్రానికి 1.2 టీఎంసీల నీరు (1649.4 అడుగులకు) చేరింది. కర్ణాటక పరిసర ప్రాంతాల్లో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు వేదవతి హగరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రాజెక్టుకు వరదనీటి ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టు కింద 12వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టులో నీరు చేరుతుండటంతో ఆయకట్టు రైతుల్లో హర్షాతీరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉర్దూభాషాభివృద్ధి, సాహిత్యంలో విశేష సేవలందించిన వారు జాతీయ, ప్రాంతీయ పురస్కారాలక దరఖాస్తు చేసుకోవాలని జిల్లామైనారిటీ సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరక్టర్ రామసుబ్బారెడ్డి శనివారం ఓప్రకటనలో తెలిపారు. నవంబరు 11న మైనారిటీ వెల్ఫేర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మౌలానాఅబుల్ కలాం ఆజాద్ జాతీయపురస్కారం, డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ పురస్కారాలు అందజేస్తామన్నారు. మౌలానాఅబుల్ కలాం ఆజాద్ పురస్కారం కింద 1.25లక్షలు, సర్టిఫికెట్, మెమెంటో, డాక్టర్ అబ్దుల్‌హఖ్ ప్రాంతీయస్థాయి పురస్కారం కింద రూ. లక్ష, సర్టిఫికెట్, మెమెంటో అందిస్తామన్నారు. రాష్ట్రానికి చెందిన ఉర్దూసాహితీవేత్తలు, పండితులు, కవులు, పాత్రికేయులు, విమర్శ, పరిశోధన, గద్యబోధన ఉర్దూ సేవలకు సేవలందించిన ఆరుగురికి జీవితకాల సాఫల్యపురస్కారాలు అందచేస్తామని వెల్లడించారు. ఉర్దూ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. ఉర్దూ అకాడమీ జారీ చేసిన దరఖాస్తు ఫారాలను పూరించి డీఈఓ/డిప్యూటీ డీఈఓలకు ఈ నెల 25లోపు పంపాలన్నారు.

లక్కీ చాన్సులే

మద్యం షాపుల ద్వారా అదృష్టం

షాపు వదులుకోవాలని అరకోటి ఆఫర్



పుట్టపర్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొందరికి కిక్కుతో లక్కు కలిసి వస్తోంది. రెండు లక్షలు పెట్టుబడి పెడితే లచ్చిందేవి వచ్చి నట్టింట్లో నాట్యం చేస్తోంది. ఇదంతా లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్నవారి గురించే... జిల్లాలో 87 మద్యం షాపులుండగా వీటికి 1518 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఒక్కరే పది దరఖాస్తులు చేసిన వారుకూడా ఉన్నారు. లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న వారు హుషారుగా ఉండగా, రానివారు లబోదిబోమంటున్నారు. స్థానికేతరులకు షాపులు దక్కడం స్థానికులకు దక్కకపోవడంతో మధ్యవర్తుల ద్వారా సంప్రదింపులతో షాపులు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ఆరుగురిని వరించిన అదృష్టం

ధర్మవరం ఎక్సైజ్ సర్కిల్లో ఒకరికే ఐదుషాపులు వచ్చాయి. మరో ముగ్గురికి ఒక్కొక్కరికి రెండు షాపులు దక్కాయి. పెనుకొండ సర్కిల్ ఓవ్యక్తికి రెండు షాపులు, మడకశిర పరిధిలో ఒకే కుటుంబానికి నాలుగుషాపులు, దక్కాయి. దీంతో ఆయా కుటుంబాల్లో ఆనందానికి హద్దే లేకుండా పోయింది.

అరకోటి ఆఫర్

కొంతమందికి ఒకటి కంటే ఎక్కువ షాపులు దక్కడంతో రెండోషాపు కోసం ఎక్కువమంది మాకంటే మాకు ఇవ్వాలని వెంటపడుతున్నారు. గుడ్‌విల్ ఎంతివ్వడానికైనా సిద్ధపడుతున్నారు. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నా ఆలోచనతో షాపులు దక్కించుకున్నవారు అరకోటి ఇస్తే మాకు ఓకే అంటున్నట్లు సమాచారం. మరికొంతమంది షాపు ఇస్తాం. మీరే పెట్టుబడి పెట్టండి. లాభాల్లో భాగమివ్వండి అంటూ బేరసారాలు సాగిస్తున్నారు. మరి కొంతమంది ఎన్ని లక్షలైనా ఇస్తాం. షాపుమాకే ఇవ్వండి. గుడ్‌విల్ తీసుకోండని ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది.

మహిళలదే అదృష్టం

మద్యాన్ని నిషేధించాలని ఉద్యమించిన మహిళలే ప్రస్తుతం మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకుంటుండటం గమనార్హం. అలా దరఖాస్తు చేసుకున్న వారిలో ఆరుగురిని అదృష్టం వరించింది. దీంతో వారి భర్తల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. దీన్ని చూసిన మరికొంతమంది మేము కూడా మా భార్య పేరుతో దరఖాస్తు చేసింటే లక్కు కలిసివచ్చేదేమోనని అభిప్రాయపడ్డారు.

జేబుకు చిల్లు

మద్యంషాపు దక్కితే లక్షలు సంపాదిద్దామని చాలామంది పోటీపడి మరి దరఖాస్తు చేశారు. కొంతమంది పది నుంచి ఇరవై షాపులకు అప్పులు చేసి మరీ దరఖాస్తు చేశారు. ఒక్క షాపు కూడా దక్కకపోవడంతో వారంతా లబోదిబోమంటున్నారు. పుట్టపర్తి సర్కిల్లో ఓవ్యక్తి భూమి అమ్మి పది మద్యంషాపులకు దరఖాస్తు చేశాడు. ఒక్క షాపుకూడా దక్కకపోవడంతో దిగాలుతో జబ్బుపడ్డాడు. హిందూపురం, ఓడీసీ, పెనుకొండ, పుట్టపర్తి పరిధిలో అత్యధికంగా దరఖాస్తులు చేసుకున్నవారికి షాపులు దక్కకపోవడంతో నిరాశకు గురయ్యారు.

విలేజ్ బ్రాండ్

పల్లెల్లో మినీ మద్యం షాపులు

అన్ని బ్రాండ్లు లభ్యం

చిలమత్తూరు, అక్టోబరు 19: ప్రభుత్వ నూతన మద్యం పాలసీతో గ్రామాల్లో మినీ మద్యం షాపులు (బెల్టు షాపులు) పుట్టుకొస్తున్నాయి. బెల్టు షాపుల పేరుతో ప్రధాన మద్యం షాపులో దొరికే అన్ని రకాలు మద్యం బాటిళ్లను అమ్మకాలకు పెట్టేశారు. దీంతో గ్రామాల్లో మద్యం ప్రియులు కావాల్సిన మద్యం కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఆయా గ్రామాల్లోనే కావాల్సి బ్రాండ్లు, కావాల్సినంత మద్యం దొరుకుతోంది. ఈక్రమంలోనే ఈ మినీ మద్యం షాపులను నిర్వాహకులు అట్టహాసంగా ప్రధాన దుకాణానికి దీటుగా ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నారు. శాస్త్రోక్తంగా బ్రాహ్మణులను పిలిపించి పూజలు చేయించి మినీ దుకాణాలు ప్రారంభిస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కుతూ గ్రామాల్లో సైతం మినీ మద్యం షాపులు ఏర్పాటు చేస్తుండటంపై ఎక్సైజ్ పోలీసులు ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి.


శెట్టిపల్లిలో టీడీపీ నాయకులు ప్రారంభించిన మద్యం బెల్టు షాపు

నేలకొరిగిన ద్రాక్ష తోట


పడిపోయిన ద్రాక్ష పంట

కూడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని హంసాపల్లి గ్రామంలో ఓ ద్రాక్షతోట నెలకొరిగింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెండెకరాల ద్రాక్ష తోట నేల కొరిగింది. ఐదు లక్షల పెట్టుబడి పెట్టి రెండెకరాల్లో ద్రాక్ష పంట సాగు చేశాడు. దిగుబడి ఆశాజనకంగానే వచ్చింది. అయితే మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి శనివారం తెల్లవారుజామున పందిరి సహా పంట మొత్తం నేలకొరిగింది. దీంతో దాదాపు రూ.15లక్షల వరకు పంట నష్టం జరిగిందని రైతు వాపోయాడు. పెట్టుబడి ఐదులక్షలు, పంట నష్టం మరో పది లక్షలుంటుందని రైతు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. హార్టికల్చర్ అధికారి నెట్టికంటయ్య తోటను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

23న పిల్లలకు ప్రత్యేక వైద్య శిబిరం : డీఎంహెచ్‌ఓ


డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీదేవి

అనంతపురం టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వినికిడిలోపం ఉన్నపిల్లలకు ఈనెల 23న ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ.దేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 0-నుంచి 19ఏళ్ల వయసు పిల్లలు వినికిడి లోపంతో ఇబ్బంది పడుతూ ఉంటే ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి వినికిడి యంత్రాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దీన్‌దయాళ్ శ్రవణా ఫౌండేషన్, జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం జిల్లా ఆస్పత్రి ఆవరణలోని 99వ ఓపీ కేంద్రం (డీఈఐసీసెంటర్)లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, చెవి డాక్టర్ రాసిచ్చిన ఓపీ చీటీ, ఆడియాలజిస్ట్ రిపోర్ట్ వివరాలు తీసుకొని రావాలన్నారు. ఆయామండలాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు వినికిడి లోపం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ఈ వైద్య శిబరంపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

డ్వామాలో ఇష్టారాజ్యం !

- అప్పటి అధికారులదే నేటికీ హవా
- నచ్చినవారికి నచ్చిన చోటుకు బదిలీ
- కొత్త అధికారిని తప్పుదోవ పట్టిస్తున్న వైనం



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్ర విచిత్రాలకు డ్వామా వేదికగా మారింది. ఎంతో కీలకమైన హెచ్‌ఆర్, విజిలెన్స్ విభాగాల్లో అధికారులు వైసీపీ పాలనలో వ్యవహరించినట్లే ఇప్పుడు కూడా చేస్తున్నారు. అప్పుడు ఓ వెలుగు వెలిగిన అధికారులు నూతన ప్రభుత్వంలో కూడా తమ హవా కొనసాగిస్తున్నారు. రెండు నెలల కిందట ఎనిమిది మంది ఏపీఓలను బదిలీ చేయగా...వారిలో కొందరు నేటికీ విధుల్లో చేరలేదు. జీతాలు మాత్రం తీసుకుంటున్నారు. వీటి వెనుక ఆ అధికారుల పాత్ర ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొత్తగా వచ్చిన అధికారిని సైతం తప్పుదోవ పట్టిస్తూ తమకు నచ్చిన వారికి హెచ్‌ఆర్ విభాగం అధికారులు మేలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

హెచ్‌ఆర్, విజిలెన్స్ కీలకం

డ్వామాలో హెచ్‌ఆర్, విజిలెన్స్ విభాగాలే కీలకం. ఎటువంటి కిరికిరి జరిగినా అందులో ఈ రెండు విభాగాల పాత్ర ఉంటుంది. అధికారులు, ఉద్యోగుల బదిలీల్లో ఈ రెండు విభాగాల నుంచే ఎక్కువ ప్రతిపాదనలు ఉంటాయి. వైసీపీ ప్రభుత్వంలో రికార్డుల్లో సీఆర్‌డీకి ఒక జాబితా, క్షేత్రస్థాయిలో మాత్రం వేరేవాళ్ల పేర్లు పెట్టారు. ఇదంతా హెచ్‌ఆర్ విభాగం ఘనతే. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నడూ లేనివిధంగా ఆరుగురు ఏపీఓలు పీడీ కార్యాలయంలో పనిచేయగా, మరో ఆరు మండలాల్లో ఇద్దరు చెప్పిన ఏపీఓలను నియమించారు. ఇలా సుమారు నాలుగేళ్లపాటు కొనసాగారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనుల కల్పనపై ప్రభావం చూపింది. డ్వామా పరిధిలో అమలు చేస్తున్న ఉపాధి, వాటర్‌షెడ్, జలకళ పథకాలలో జరిగిన అక్రమాలు, ఫిర్యాదులు అందితే వాటిని పరిశీలించి, పరిష్కరించడమే విజిలెన్స్ విభాగం ప్రధాన కర్తవ్యం. ప్రజావేదిక (ఓపెన్‌ఫోరం) ద్వారా నిధుల దుర్వినియోగం, అందుకు బాధ్యులను తేల్చాలి. ఈ ఓపెన్‌ఫోరం పెట్టినప్పుడు మాత్రమే విజిలెన్స్ విభాగంలోని ఓ అధికారి విధుల్లో ఉంటారు. అది అయిపోగానే సెలవులో వెళ్లిపోతారనే ప్రచారం ఆశాఖలో ఉంది. ఓపెన్ ఫోరం పేరుతో విజిలెన్స్ విభాగంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు మూటగట్టుకుంటున్న అధికారికే తిరిగి డ్వామాలోనే ఫైనాన్స్ మేనేజర్ పోస్టును అదనంగా తగిలించడం గమనార్హం.

కొత్త అధికారిని తప్పుదోవ పట్టిస్తూ బదిలీలు

డ్వామాకు కొత్తగా వచ్చిన పీడీని సైతం తప్పుదోవ పట్టిస్తూ తమకు నచ్చిన వారికి, ముడుపులు పుచ్చుకుని గుట్టుచప్పుడు కాకుండా బదిలీలు చేస్తున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. తనకు తెలియకుండా ఏ ఒక్క ఉద్యోగిని బదిలీ చేయకూడదనే కలెక్టర్ ఆదేశాలను సైతం పక్కనపెట్టి హెచ్‌ఆర్ విభాగం అధికారుల బరితెగింపుతో స్థానచలనం చేస్తున్నారు. రెండు రోజులుగా బయటకు పొక్కకుండా ఉద్యోగుల బదిలీలు చేస్తున్నారనే చర్చ ఆశాఖలో జోరుగా సాగుతోంది.

మా దృష్టికి వస్తే చర్యలు తప్పవు

డ్వామాలో అధికారులు, ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా ఉండాలి. అయితే ప్రస్తుతానికి బదిలీలు లేవు. ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నందున బదిలీలకు కొద్దిగా మినహాయింపు ఇచ్చారు. ఏపీడీ, ఏపీఓల బదిలీలపై పరిశీలిస్తాం. కలెక్టర్ బదిలీ చేసిన ఉత్తర్వుల మేరకు ఏపీఓలు అందరూ ఆయా స్థానాల్లో విధుల్లో చేరాల్సిందే. అలా విధుల్లో చేరని ఏపీఓలపైనా చర్యలు ఉంటాయి. బదిలీలకు సంబంధించి ఎటువంటి ప్రలోభాలను ఉద్యోగులు నమ్మొద్దు. కొత్తగా ఎవరినీ బదిలీ చేయలేదు.

- సలీంబాషా, డ్వామా పీడీ

టమోటా కిలో రూ.43

అనంతపురంరూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్ లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.43తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 2250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.28, కనిష్ఠ ధర రూ.16 పలికినట్లు ఆయన తెలిపారు.

1.675 టీఎంసీల నీటినిల్వ

బెళుగుప్ప, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.675 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. అలాగే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1193 క్యూసెక్కులు వుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1071 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఎస్ గేటు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్ కో ఏఈ రామాంజినేయులు తెలిపారు. చెన్నేకొత్తపల్లి, ఎర్రజిన్నన్నగారిపల్లి, పల్లెన్నగారిపల్లి, ఎర్రంపల్లి, నాగసముద్రం, ఎన్ఎస్‌గేటు, దామాజిపల్లి, బసినేపల్లి, ఉప్పరవాండ్లపల్లి కొట్టాల గ్రామాలలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మెయిన్‌టెనెన్స్‌పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మార్కెట్ ఫీజు వసూళ్ల పరిశీలన



ఫీజు వసూళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ కమిటీ సభ్యులు

అనంతపురం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం గొర్రెల, మేకల సంత జరిగింది. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యులు సంతలో ఫీజువసూళ్లను పరిశీలించారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ.... మార్కెట్‌ల ఆదాయం పెంపుకోసం మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ప్రతిజిల్లాకు విజిలెన్స్ కమిటీని నియమించిదని తెలిపారు. జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ ప్రధాన సభ్యుడిగా ఉంటారని, స్థానిక మార్కెట్ కమిటీతో పాటు మరో మూడు కమిటీలకు సంబంధించిన కార్యదర్శులు సభ్యులుగా ఉంటారన్నారు. మార్కెట్ కమిటీల ఆదాయం పెంపు తదితర అంశాలపై విజిలెన్స్ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు రాంప్రసాద్, ఆనంద్, కేధార్, గ్రేడ్-2 కార్యదర్శి రూప్‌కుమార్, సూపర్‌వైజర్లు కేశవకుమార్, నాగేంద్ర, కృపావతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

గార్లదిన్నె, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు సంబంధిచిన సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బండారు ఈరమ్మ పేర్కొన్నారు. మండలంలోని కొప్పలకొండ, కల్లూరు అగ్రహారం గ్రామాల్లో శనివారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తోందని తెలిపారు. అదేవిధంగా కల్లూరులో ముస్లింలకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని అర్జీ అందజేశారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని శేషంపల్లిలో శనివారం రీ సర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభ ఏర్పాటు చేసి రైతులతో అర్జీలు స్వీకరించారు. డీటీ నరేశ్‌బాబు, ఆర్ఐ నరసింహమూర్తి, వీఆర్వో ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

టపాసులు అక్రమ నిల్వలపై తనిఖీలు

● విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):: జిల్లాలో టపాసులు అక్రమ నిల్వలపై విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్ తెలిపారు. ఆయన శనివారం విజిలెన్స్ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో పలు విషయాలను వెల్లడించారు. దీపావళి పండుగ దగ్గరలో ఉండటంతో ట్యాక్స్‌లు చెల్లించకుండా టపాసుల అక్రమ నిల్వలు ఉంచుకున్నట్లు సమాచారం ఉందన్నారు. టపాసులు అక్రమ నిల్వలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు అయన తెలిపారు. ఇప్పటికే అక్రమ నిల్వలపై టీమ్‌లు తనిఖీలు చేపట్టా యని, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచి పట్టు పడితే ఇబ్బందులు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇప్పటి వరకు రెగ్యులర్ అధికారులు లేకపోవడం వల్ల తనిఖీల్లో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం పూర్తి స్థాయిలో రెగ్యులర్ సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఇకపై ఎలాంటి అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

టపాసుల వాహనం సీజ్

● రూ.2,70,532 జరిమానా: విజిలెన్స్ డీఎస్పీ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమంగా టపాసులు తరలిస్తున్న వాహనాన్ని ఈ నెల 17న పట్టుకున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా కల్లూరు సమీపంలోని లోలూరు క్రాస్‌లో తనిఖీలు చేపట్టామన్నారు. ఆ మార్గంలో వచ్చిన వాహనాన్ని ఆపి రికార్డు లు పరిశీలించగా, టపాసులకు సంబంధించి బిల్లులు లేనట్లు తేలిందన్నారు. తమిళనాడులోని శివకాశి నుంచి బీదర్ వెళుతున్నట్లు తెలిపారు. దీంతో వాహనాన్ని సీజ్ చేసి సేల్స్ ట్యాక్స్ అధికారులకు అప్పగించామన్నారు. పూర్తి స్థాయిలో పరిశీలించి రూ.2,70,532 అపరాధ రుసుం వసూలు చేశారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రవాణా చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్ ఆదేశాల మేరకు సిబ్బందిని టీమ్‌లుగా విభజించి విస్తృత తనికీలు చేపట్టినట్లు తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

బుక్కరాయసముద్రం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతంలోని శర్మ కాలనీ వద్ద పేకాట స్థావరంపై సీఐ కరుణాకర్, సిబ్బంది దాడి చేశారు. ఈ దాడుల్లో రూ.98 వేలు నగదు స్వాధీనం చేసుకుని, ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కొంత కాలంగా నగరంలోని పలువురు మొబైల్ గ్యాంబ్లింగ్ చేస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం రాత్రి దాడి చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు

రీసర్వే గ్రామ సభలకు తక్కువగా రైతులు

● సమాచారం ఇవ్వడంలో అధికారులు విఫలం
● పలువురి విమర్శ



లోలూరులో సభకు తక్కువగా హాజరైన రైతులు

శింగనమల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో చేసిన భూ రీ సర్వే పూర్తి చేసి సంబంధిత రైతులకు అందించిన భూ హక్కు పత్రాల్లో చాలా తప్పులు వచ్చాయి. వాటిని సరిదిద్దుకోవడానికి రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహిస్తున్నా, సమాచారం లేకపోవడంతో గ్రామ సభలకు చాలామంది హాజరు కాలేకపోతున్నారు. గ్రామ సభల గురించి సంబంధిత రైతులకు సమాచారం ఇస్తున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నా... ఏ గ్రామంలో ఏ రోజు సభ జరుగుతుందనే సమాచారంలేక పోవడం గమనార్హం. మండలంలో 10 రెవెన్యూ గ్రామాల పరిధిలో రీసర్వే పనులు పూర్తి చేశారు. వివరాలను తప్పులు తడకలగానే వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసి ఆన్‌లైన్ భూ హక్కు పత్రాలు(జగన్ ఫొటో ఉన్న పాసు పుస్తకాలు) అందజేశారు. అయితే వాటిలో తప్పులు దొర్లాయని అప్పట్లోనే రెవెన్యూ అధికారులకు చాలా ఫిర్యాదులు అందినా, ఎవరూ పట్టించుకోలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ నెల 18 నుంచి 29 తేదీ వరకు రెవెన్యూ గ్రాసభలను నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. అయితే అధికారులు సమాచారం ఇవ్వక పోవడంతో రైతులు ఎక్కువమంది హాజరుకాలేకపోతున్నారని, అయినా తూతూ మంత్రంగా సభలు పెట్టి ప్రభుత్వ ఉద్దేశాన్ని నీరు గారుస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

పట్టుమని 20మంది రైతులు లేరు

మండలంలోని ఆకులేడు, లోలూరు రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం, చన్నవరం, కర్ణాటకంపల్లి, వెస్టునర సాపురం రెవెన్యూ గ్రామాల్లో శనివారం సభలు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ పునీత్, మండల సర్వే యర్ స్టీఫెన్ వీరకుమార్ గ్రామ సర్వేయర్లు హాజయ్యారు. అయితే రైతులు మాత్రం ఏ సభలో కూడా పట్టుమని 20 నుంచి 30 మంది లేరు. వారిలోనే రీసర్వేలో భూమిని కోల్పోయిన రైతులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. గ్రామసభలపై తమకు సమాచారం లేదని పలువురు రైతులు తెలుపుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా...

మాకు రాచేపల్లి రెవెన్యూ పొలంలో భూమి ఉంది. నాకు సంబంధించిన భూమిలో రీసర్వే చేసి 40 సెంట్లు తక్కువ చూపి భూహక్కుపత్రం ఇచ్చారు. దీనిపై తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఎన్ని సా ర్లు తిరిగినా ప్రయోజనంలేదు. ఇప్పుడు గ్రామసభల్లో అయినా నాసమస్య తీరుతుందో లేదో చూడాలి.

- సూర్యనారాయణ, రైతు, ఇరువెందల గ్రామం

రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రీసర్వే అనంతరం ఇచ్చిన భూ హక్కుపత్రాల్లో భూ విస్తీర్ణం, రైతుల పేర్లు, సర్వేనంబర్లు తదితర విష యాల్లో కుప్పలు తెప్పలుగా తప్పులు వచ్చాయి. వా టిని పరిష్కరించుకోవడానికి రైతులు ఎన్నో తిప్పలు పడుతున్నారు. గ్రామ సభల్లో ఫిర్యాదు చేస్తే పరిష్కరి స్తామని ఇప్పుడు కూటమి ప్రభుత్వం తెలిపింది. అయితే అధికారులు గ్రామసభలు ఎప్పుడు నిర్వహిస్తున్నారనే సమాచారం ఎక్కడా లేదు.

- చిన్నప్పయాదవ్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

ఒక రోజు ముందే తెలుపుతున్నాం

రీసర్వే గ్రామసభలపై సంబంధిత గ్రామాల్లో ఒక రోజు ముందే దండోరా వేయిసున్నాం. అలాగే వీఆర్ఓ, వీఆర్ఏలు రైతులకు సమాచారం తెలుపుతున్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఈనెల 18 నుంచి 29వ తేదీ వరకు సభలు నిర్వహిస్తాం.

- బ్రహ్మయ్య, తహసీల్దార్, శింగనమల

గ్రామస్థుల నిర్ణయం మేరకే అభివృద్ధి పనులు

● పల్లె పండుగలో ఎమ్మెల్యే పరిటాల సునీత



గంగంపల్లి తండాలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏ పనులు చేయాలో నిర్ణయించాల్సింది ఆ గ్రామస్థులే అని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని గంగంపల్లి తండాలో శనివారం పల్లెపండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొని సీసీరోడ్లకు భూమిపూజచేశారు. నసనకోట పంచాయతీ గంగంపల్లి ఎస్సీకాలనీలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.20లక్షలు, జడ్పీ నిధులు రూ.48లక్షలతో సీసీరోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రాకమునుపు, వచ్చిన తరువాత గ్రామాల్లో అభివృద్ధి ఎలా సాగుతుందో ప్రజలే గమనించాలన్నారు. గతంలో గ్రామాలకు రోడ్లు వేయాలని ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. అంతకుమునుపు తాము మంజూరు చేయించిన రోడ్లను కూడా వేయనీయలేదన్నారు, టీడీపీ అధికారంలోకి వచ్చాక రాప్తాడు నియోజకవర్గానికి మాత్రమే రూ.25కోట్లు వచ్చాయని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో పనులు జరుగుతాయని నాణ్యత లోపంపై ప్రశ్నించే అర్హత మీకుందన్నారు. అనంతరం గంగంపల్లితండాలో సమస్యలపై గ్రామస్థులతో చర్చించారు. గ్రామంలో కమ్యూనిటీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వపాఠశాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, ప్రధానకార్యదర్శి మారుతిప్రసాద్, సర్పంచ్ లలితమ్మ, ఎంపీడీఓ ఆజాద్, డీఈ లక్ష్మీనారాయణ, తెలుగుయువత శ్రీధర్‌నాయుడు, గంగాధర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఉన్నా.. డబ్బు చెల్లించాల్సిందే..!

● కిమ్స్ సవీరా ఆస్పత్రిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



ఎమ్మెల్యే సునీతతో మాట్లాడుతున్న బాధితుడి తల్లి

రామగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పథకం అమలవుతున్నా డబ్బులు చెల్లించాల్సిందేనని అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రి యాజమాన్యం బాధితులను డిమాండ్ చేస్తోందిని ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఫిర్యాదులు వచ్చాయి. మండలంలోని గంగంపల్లికి ఎమ్మెల్యే శనివారం వెళ్లినప్పుడు... ఆ గ్రామానికి చెందిన బాధితుడు శ్రీకాంత్ తల్లి గోవిందమ్మ అనే మహిళ తన గోడు వెళ్లబోసుకున్నారు. తాము పేదలమని, తమ వద్ద డబ్బులు లేవని తెలిపినా రూ.30వేలు చెల్లించకుంటే ఆపరేషన్ చేయమని ఖరాకండిగా ఆస్పత్రి యాజమాన్యం తెలిపిందన్నారు. ఆ రూ.30వేలకు రసీదు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యేకు బాధితులు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత ప్రభుత్వ వైద్యాధికారులకు ఫోన్‌చేశారు. ఈ విషయంపై ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకానికి సంబంధించిన అధికారులు విచారణ చేస్తున్నట్టు తెలిసింది. దీనిపై వైద్యాధికారులు సవేరా ఆస్పత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. లేకుంటే బాధితుల ఆగ్రహం చూడాల్సి వస్తుందని ఆస్పత్రి ఎదుటే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

కొల్హాపూర్ అభ్యర్థుల ఎంపికలో శైలజానాథ్



దరఖాస్తుల పరిశీలనలో మాజీ మంత్రి సాకే శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా ఇన్‌చార్జ్‌గా మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను నియమిం చారు. దీంతో అక్కడ ఎన్ని కల నిర్వాహణకు శ్రీకారం చుట్టడంతో బరిలో దిగే అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసేలా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి శనివారం పలువురు అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని బోయగేరిలో ఇద్దరు మట్కా నిర్వహిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5950 స్వాధీనం చేసుకున్నారు.

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరులో ఓ మట్కా బీటర్‌ను శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. కల్లూరులో మట్కా రాస్తున్నట్లు సమాచారం రావడంతో బస్టాండ్ సర్కిల్లో అతడిని తనిఖీ చేశామన్నారు. అతడి వద్ద నుంచి మట్కా స్లిప్పులు, రూ. 10500 నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. మండలంలోని ఎవ్వరైన మట్కా, పేకాట తదితర జూదాలు నిర్వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నేరాలను అరికట్టేందుకు ముమ్మర గస్తీ

గార్లదిన్నె, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చోరీలను, నేరాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా గస్తీ నిర్వహిస్తున్నామని ఎస్ఐ మహమ్మద్ గౌస్ బాషా తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. . మండలంలో రాత్రి సమయంలో జరుగుతున్న చోరీలను, నేరాలను అరికట్టేందుకు ఉన్నతాధికారులు ఉత్తర్వుల మేరకు ప్రతి గ్రామంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రతి రోజు రాత్రి సమయంలో పోలీసులు ప్రతి గ్రామంలో గస్తీ నిర్వహిస్తు ప్రజలకు రక్షణగా ఉంటున్నామన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో రాత్రి నుంచి తెల్లవారే వరకు పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బ్యాంకులు, ఏటీఎంల వద్ద ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. రాత్రి 10 గంటలు సమయం దాటితే ఎవరు రోడ్లపై తిరగవద్దన్నారు. అత్యవసరం ఉంటే తప్ప ఎవరు రోడ్లపై తిరగరాదని ఎస్ఐ సూచించారు.

బాల్యం నుంచే వివక్షను ఎదుర్కోవాలా?

● ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : అభం శుభం తెలియని బాల్యం నుంచే సమాజంలో కుల వివక్షను ఎదుర్కోవాలా? అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ... చైతన్యం దిశగా పయనియస్తున్న కంప్యూటర్ కాలంలోనూ కుల రక్కసి వెంటాడుతోందని వాపోయారు. బ్రహ్మసముద్రం మండల వెస్ట్ కోడిపల్లి అంగన్ వాడీ కేంద్రంలో జరిగిన సంఘటన ఇందుకు నిదర్శనమన్నారు. కుల వివక్షకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఏపీడీ వనజాక్షికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, గోవింద్, రామదాసు, విజయ్, రామకృష్ణ, వేణుగోపాల్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని అన్ని చెరువులను నీటితో నింపాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



రాప్తాడులో మాట్లాడుతున్న రాంభూపాల్

రాప్తాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని చెరువులను నీటితో నింపి, రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. సాగు, తాగు నీరు, రైతు సమస్యల పరిష్కారం కోసం శనివారం రాప్తాడు బస్టాండు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో బస్సు జాతా నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద రైతు సమస్యలపై సోమవారం ధర్నా చేపడతామన్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ చెరువులకు, ఆయకట్టుకు నీరు ఇవ్వకపోతే రైతులు ఇబ్బంది పడతారన్నారు. తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్లు అమర్చాలన్నారు. హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు చేపట్టాలన్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలన్నారు. రైతులందరికీ సబ్సిడీ డ్రిప్పు, వ్యవసాయ పరికరాలు ఇవ్వాలన్నారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల నిర్వహణకు నిధులు కేటాయించాలన్నారు. భారీ వర్షాల వలన వలన నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు పోతులయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రామాంజినేయులు, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

రామగిరిలో భారీ వర్షం

● మరువలు పారుతున్న చెరువులు

రామగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గత నాలుగురోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం వస్తుండటంతో చెరువులు, కుంటలకు నీరు చేరింది. హంద్రీనీవా కాలువ ద్వారా కూడా కుంటిమద్ది, గంతిమర్రి, శేషంపల్లి, పోలేపల్లి చెరువులకు నీరు వదలడం, దీనికితోడు వర్షపు నీరు తోడుకావడంతో చెరువుల మరువలు పారుతున్నాయి. అలాగే కలికివాండ్లపల్లి, పెనుబోలు మధ్య ఉన్న కల్వర్టు వద్ద నీరు భారీగా వెళ్తుండటంతో రాకపోకలక ప్రమాదకరంగా మారింది. దీంతో ఎస్ఐ సుధాకర్‌యాదవ్ అక్కడికి వెళ్లి రాకపోకలను నిలిపివేశారు. వర్షపు నీరు తగ్గేవరకు అక్కడి నుంచి వెళ్లరాదని ప్రజలకు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్నిచోట్ల ఓ మోస్తరు వర్షంపడింది.

వరద బాధితులకు సాయం



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): వరద బాధిత సహాయ నిధికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రూ. 50 వేలు చెక్కును అందజేశారు. బుక్కరాయసముద్రం సిద్దరాంపురం పంచాయతీ కొండాపురానికి చెందిన కొందరు పింఛన్ దారులు వరద బాధిత నిధికి సేకరించిన రూ.50వేలు చెక్కును జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వసుపుల హనుమంతురెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి అందజేశారు. ఆమె శనివారం మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేశారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముస్లింలు

అనంతపురం అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మదరసా ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుద్దీన్ సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక కమలానగర్‌లో శనివారం సైపుద్దీన్ ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మదరసా ఉపాధ్యాయులకు రూ.10 కోట్లు నిధులు విడుదల చేయడం శుభపరిణామమన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనపై ర్యాలీ

రామగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రామగిరిలో శనివారం పాస్ స్వచ్ఛందసంస్థ, మదర్‌థెరిసా సొసైటీ సంయుక్తంగా మానవ అక్రమ రవాణా నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి నల్లదుస్తులు ధరించి ర్యాలీ చేపట్టారు. మానవహారం ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాస్ సంస్థ సీఈఓ రామప్ప, కోఆర్డినేటర్ ఇందిర, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఢిల్లీకి వెళ్లిన నగర కమిషనర్

అనంతపురం క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగర కమిషనర్ నాగరాజు ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే అర్బన్ సర్వే అంశంపై సోమ, మంగళవారాల్లో నిర్వహించే సమావేశానికి కమిషనర్ హాజరు కానున్నారు. అనంతరం తిరిగి ఈ నెల 23న కమిషనర్ నగరానికి రానున్నారు.

జాతీయ స్థాయి మహిళా ఫుట్‌బాల్ టోర్నీ

● ఒడిషా, అరుణాచల్‌ప్రదేశ్ జట్ల శుభారంభం



పోటీల ప్రారంభోత్సవంలో క్రీడాకారులు, సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ మహిళల జాతీయ స్థాయి ఫుట్‌బాల్ రాజామాత జీజాబాయి ట్రోఫీ పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో శనివారం రాజామాత జీజీబాయి సీనియర్ మహిళల జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డేనియల్ ప్రదీప్ ప్రారంభించారు. ఒడిషా, లడఖ్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్ జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫుట్‌బాల్ మహిళల పోటీలు ఈ నెల 23వతేదీ వరకు జరుగుతాయన్నారు. మొదటి మ్యాచ్‌లో లడఖ్‌పై ఏడు పాయింట్ల తేడాతో ఒడిషా విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్ చేతిలో మధ్యప్రదేశ్ ఎనిమిది పాయింట్ల తేడాతో ఓటమిపాలైంది. దీంతో ఒడిషా, అరుణాచల్ ప్రదేశ్ జట్లు విజయం సాధించి శుభారంభాన్ని అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నాగరాజు, కోఆర్డినేటర్ దాదాకలందర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి రాజీనామా



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి రాజీనామా చేశారు. గత ఐదేళ్లుగా మధు ఆచారి జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అయితే వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని జిల్లా క్రికెట్ సంఘానికి, ఆంధ్రా క్రికెట్ సంఘానికి పంపారు. ఇన్నాళ్లు తనకు అవకాశం కల్పించి, క్రికెట్‌కు సేవలందించేందుకు సహకరించిన ఆంధ్రా, జిల్లా క్రికెట్ సంఘంతో పాటు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా పల్లకి సేవ


పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఆలయంలో మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు పొందారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను వినియోగించుకోండి

గుంతకల్లు టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 26వ సచివాలయంలో శనివారం న్యాక్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్, ఫ్లంబింగ్, సర్వేపై ఉచిత శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ కౌన్సిలర్ అంజి హాజరై మాట్లాడారు. రెండు నెలల 15రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్‌తో పాటు ప్లేస్‌మెంట్ కల్పిస్తారన్నారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు గల వారు వినియోగించుకోవాలని సూచించారు. ట్రైనింగ్ ఇన్‌చార్జి సుధాకర్, న్యాక్ ట్రైనర్ శ్రీనివాసులు, సచివాలయ అడ్మిన్లు నివేదిత, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విడపనకల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ అధికారులు శనివారం బాల్యవివాహాలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. సూపర్‌వైజర్ ఉమారాణి మట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. చిన్న వయసులో వివాహం చేస్తే శారీరక, మానసిక రుగ్మతలు కూడా ఏర్పడతాయన్నారు. బాల్య వివాహాలను ప్రతిఒక్కరూ అరికట్టాలన్నారు. బాలికలు ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశామని, ఇందులో నిరుద్యోగులకు పలు అంశాలపై ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వైఎస్ శ్రీధర్ కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వెంకట ప్రతాప్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులకు రెండు నుంచి మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కళ్యాణదుర్గం చుట్టుపక్కల ఉన్న గ్రామాల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 9440661900, 9010965230కు సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రాయదుర్గం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోతిగుట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాయదుర్గం మండలం ఆయతపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్ శనివారం సాయంత్రం స్వగ్రామం నుంచి రాయదుర్గానికి బైక్‌లో బయలుదేరాడు. కోతిగుట్ట వద్దకు రాగానే పంది అడ్డం రావడంతో తప్పించబోయి కిందకు పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. తర్వాత కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

మట్కా బీటర్ల అరెస్టు

తాడిపత్రి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నెవారిపల్లి కాలనీలో శనివారం ఓ మట్కాబీటర్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.1540 నగదు స్వాధీనం చేసుకున్నామని రూరల్ పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడిచేసి మట్కాబీటర్‌ను అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

యాడికి: మండలకేంద్రంలో ఒకరిని, లక్షుంపల్లిలో ఇద్దరు మట్కా మట్కాబీటర్లను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.60వేలు నగదు సీజ్‌చేసినట్లు పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి వారిని పట్టుకున్నామన్నారు. వెంటనే అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లిలో ఇద్దరు మట్కాబీటర్లను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.1.40లక్షల నగదు, మట్కాచిట్టీలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు. సీఐ సత్యబాబుకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. ఇందులో ఇరువురు మట్కాబీటర్లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

పేకాట రాయుళ్లు...

బొమ్మనహాళ్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బీ నగర్ గ్రామశివారులో గల ఒక తోటలో శనివారం సాయంత్రం పేకాట ఆడుతున్న 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి రూ. 82,700ల నగదును, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి వారిని పట్టుకున్నట్లు చెప్పారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ, కంది పంటకు తెగుళ్లు సోకకుండా నివారణ చర్యలు చేపట్టేలా రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయశాఖ జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి వ్యవసాయ అధికారులకు సూచించారు. మండలంలోని 74 ఉడేగోళం రైతు సేవా కేంద్రంలో శనివారం ఆయన వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం పంటలకు సోకే పురుగులు , తెగుళ్లను మొబైల్ అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. వేరుశనగ, కంది పంటలకు సోకే పురుగులు, తెగుళ్ల గురించి రైతులకు తెలియజేసి వాటి సస్యరక్షణ చర్యలు ఎలా చేపట్టాలనే అంశాలను వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం అధికారిణి శైలజ, సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్, వ్యవసాయాధికారి శ్రీనివాసులు మహేంద్ర, మూడు మండలాల వ్యవసాయ అధికారులు, రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీలను ప్రతిరైతు వినియోగించుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందించే సబ్సిడీలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయన డివిజన్ పరిధిలోని కళ్యాణదుర్గం, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి, కంబదూరు మండలాలకు చెందిన ఏపీఎంఐపీలో పని చేస్తున్న డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, ఫీల్డ్ ఆపరేటర్లు, డీలర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024-25కు సంబంధించి ప్రభుత్వం బోరుబావి ఉన్న ప్రతి రైతుకు డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు ఇస్తుందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, హెచ్‌వో గౌసియా, ఎంఐఓ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్ నుంచి కుడికాలువకు నీరు ఇవ్వాలి

కూడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ డ్యాం నుంచి కుడికాలువకు నీరు విడుదల చేసి చెరువులు నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాం భూపాల్ డిమాండ్ చేశారు. సీపీపీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర శనివారం కూడేరుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ పీఏబీఆర్ డ్యాం నుండి 49 చెరువులకు నీరిస్తే భూగర్భ జలాలు పెరగడంతోపాటు పశువులకు తాగునీరు దొరుకుతాయన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలకు తాగు, సాగు నీరు గుర్తుకొస్తుందన్నారు. అధికారంలోకి రాగానే మర్చిపోతారనానరు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. నాయకులు కృష్ణమూర్తి, వెంకటేష్, వీరప్ప, కరీమ్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- వార్డెన్లకు గుత్తి సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాశీ విశ్వనాథ్‌చారి సూచన
- పలు హాస్టళ్ల తనిఖీ


పామిడిలోని ఎస్సీ బాలుర హాస్టల్లో రికార్డులను పరిశీలిస్తున్న న్యాయాధికారి కాశీ విశ్వనాథ్‌చారి


గుంతకల్లులోని బీసీ బాలుర హాస్టల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయాధికారి మంజుల

పామిడి/ గుత్తి/ పెద్దవడుగూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలని గుత్తి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. కాశీ విశ్వనాథ్ చారి తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం ఆయన పట్టణంలోని బాలుర ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వంటగది, వసతి గదులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. హాస్టల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఏమైనా సమస్యలు ఉన్నాయా అని వార్డెన్ ఆదినారాయణను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సినవి సక్రమంగా అందుతున్నాయా...? అని ఆరా తీశారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ వీసీ గంగాధర్‌కుమార్, టైపిస్ట్ సాధిక్ వలి, పారా లీగల్ వలంటీర్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆయన గుత్తి పట్టణంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను రాత్రి సమయంలో తనిఖీ చేసి అక్కడి సమస్యలపై హాస్టల్ వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అన్ని వసతులు సమకూర్చాలని సూచించారు. అదేవిధంగా పెద్దవడుగూరులోని బాలుర వసతి గృహాన్ని కూడా ఆయన తనిఖీ చేసి అక్కడ విద్యార్థుల వసతులను పరిశీలించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్సీ బాలికల 1,2 హాస్టళ్లను, బీసీ బాలుర హాస్టల్‌ను గుంతకల్లు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి జీ. మంజుల తనిఖీ చేశారు. ముందుగా బాలికల ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసి అక్కడి వంటగదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. తర్వాత బాలుర బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి హాస్టళ్ల లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం సరిగా ఉండదని, తాగడానికి నీళ్లు కూడా లేవని, మరుగుదొడ్లు సరిగా లేవని, దీంతో ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు న్యాయాధికారికి తెలిపారు. దీనిపై వార్డెన్‌పై ఆగ్రహం చేసిన న్యాయాధికారి మరోసారి ఇలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వన్‌టౌన్ సీఐ మనోహర్, రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పల్లె పండుగ

యాడికి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో శనివారం పల్లె పండుగ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య పాల్గొని సీసీ రోడ్డు , గోకులం షెడ్డు నిర్మాణానికి, ఫారంపండ్ తవ్వకానికి శంకుస్థాపన చేశారు. తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పరిమి చరణ్, ఎంపీడీఓ వీరరాజు, ఈఓపీఆర్‌డీ శశికళ, పీఆర్ జేఈ యల్లమనాయుడు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలో దుద్దేకుంట హనిమిరెడ్డిపల్లి, కోనంపల్లి గ్రామాల్లో పల్లె పండుగ ను అధికారులు నిర్వహించారు. మాజీ వైస్‌ఎంపీపీ తిమ్మప్ప, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఏపీవో సూర్యప్రకాష్, పీఆర్‌జేఈ పరశురామ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని మహంతపురంలో పల్లె పండుగ నిర్వహించారు. ఎంపీడీఓ హరికృష్ణ బాలాజీ, టీడీపీ శ్రేణులు హాజరై ఉపాధి పథకం కింద పలు రైతుల పొలాల్లో పండ్ల మొక్కలను నాటారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడులో పల్లె పండుగను అధికారులు, నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 30 లక్షల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ సురేష్, సర్పంచ్ కవిత, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కాలవ సన్నన్న, మాజీ ఎంపీటీసీ గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని జి కొట్టాల, పాళ్యం తండా గ్రామాల్లో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న రూ. 55 లక్షల వ్యయంతో సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈఓఆర్డీ కృష్ణకుమార్, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉరవకొండ: వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి భూమిపూజ చేశారు. గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.65లక్షల వ్యయంతో చేపట్టబో యే పనులను ప్రారంభించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సదస్సును విజయవంతం చేయండి

గుంతకల్లు టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఈనెల 24,25 జరిగే రాష్ట్రస్థాయి సోషల్ మీడియా సామాజిక అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సదస్సుకు 26జిల్లాల ముఖ్యనాయకులు హాజరవుతారన్నారు. పెద్ద ఎత్తున యువకులు, విద్యార్థులు హాజరుకావాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి వంశీకృష్ణ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులుయాదవ్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఈశ్వరయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల పట్ల కులవివక్ష చూపడం హేయం

బ్రహ్మసముద్రం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కోడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఈ నెల 16న దళిత చిన్నారుల పట్ల కులవివక్షత చూపించడంపై శనివారం ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలుకా అధ్యక్షుడు చెలమప్ప, జిల్లా నాయకుడు దొనతిమ్మప్ప మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దళిత చిన్నారుల పట్ల కులవివక్ష చూపడం హేయమైన చర్య అని అన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలోకి రానివ్వకుండా అడ్డుపడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఎస్సీఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం ఐసీడీఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీకేంద్రాలపై సీడీపీవో లక్ష్మీప్రసన్న పర్యవేక్షణ లోపించిందన్నారు. అందుకే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. త్వరలో కలెక్టర్‌ను కలిసి సమస్య విన్నవిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ మండల ఇన్‌చార్జి చంద్ర, నాయకులు చెనమల్ల, నరసింహులు, మల్లికార్జున, నారాయణ, తిమ్మప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బెళుగుప్ప, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కళ్యాణదుర్గం మండలం ముదినాయన పల్లికి చెందిన గంగాధర (30) శనివారం ఆత్మకూరు నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. కాగా కాలువపల్లి వద్ద బ్రిడ్జిపై ప్రమాదవశాత్తు రక్షణ గోడను ఢీకొట్టి కిందకు పడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో గమనించిన స్థానికులు అతడిని రోడ్డుపైకి చేర్చారు. కాగా 108 వాహనం వచ్చేలోగానే అతను చనిపోయాడు. భార్య శిల్ప శ్రీమంతానికి సరుకులు తీసుకువస్తానని వెళ్లి ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని బంధువులు విలపించారు. ఎస్‌ఐ శివ సంఘటనా స్థలానికి వెళ్లి విచారించి కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి మరొకరు..

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం తండా వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బొమ్మన్న(45) అనే వ్యక్తి మృతి చెందాడు. రాయదుర్గం పట్టణం సిద్దేశ్వరకాలనీకి చెందిన బొమ్మన్న కర్ణాటక ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలోని పదారుగుడ్డం వద్ద ఉన్న మొక్కజొన్న పొలానికి శనివారం కూలి పనికి బైక్‌లో వెళ్లాడు. సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మల్లాపురం తండా వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బొమ్మన్నకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కుమారుడు వచ్చి రాయదుర్గం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించేలోగానే అతను మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. మృతుడికి తల్లి, భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కూడేరును కరువు ప్రాంతంగా ప్రకటించాలి

కూడేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కరువు మండలంగా కూడేరును ప్రకటించాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు స్థానిక రైతులు కోరారు. అనంతపురంలో శనివారం వారు మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కూడేరును కరువు మండలంగా ప్రకటిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, అందుకు కృషి చేయాలని కోరారు.

సబ్‌జైలు తనిఖీ

గుత్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రత్యేక సబ్‌జైలును శనివారం రాత్రి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ శివప్రసాద్‌యాదవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఖైదీల గదులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. జైలర్ మహేశ్వరుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్లగూడూరు గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అపస్మారకస్థితిలో ఉన్నఅతడిని సమీప రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి వెంటనే చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రెండోరోజూ నిరసన

తాడిపత్రి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్‌సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపుతోందని టీడీపీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు శనివారం రెండో రోజూ నిరసన తెలిపారు. సాధారణ పరిశీలనలో భాగంగా నాక్ బృందం సభ్యులు ఆ కళాశాల వస్తుండగా వారు అడ్డుకున్నారు. దీంతో ఆ బృందం సభ్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎమ్మార్సీకి మరమ్మతులు చేస్తాం: ఎంపీడీఓ

కుందుర్పి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంపై ఆంధ్రజ్యోతి పత్రికలో శనివారం కథనం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు వెంటనే స్పందించారు. ఎంపీడీవో హరికృష్ణ బాలాజీ, ఎంఈవో తిప్పేస్వామిని కలిసి ఎమ్మార్సీ భవనం వివరాలను సేకరించారు. నిధులను ఏర్పాటు చేసి వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

ఆంధ్రజ్యోతికి స్పందన

పొలికిలో నేడు వైద్యశిబిరం

విడపనకల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలికి గ్రామంలో మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ మండల నాయకులు శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ జరిగే వైద్యశిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

కణేకల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొల్లాపురం నుంచి హనకనహాళ్ మీదుగా బెళుగుప్ప వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ డీఈ రవిశంకర్ శనివారం తెలిపారు. దాదాపు 12 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ. 46 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే టెండరు ప్రక్రియ కూడా పూర్తైందని అన్నారు. పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

సీసీరోడ్ల పనుల పరిశీలన

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాల వెంకటాపురం, నుసికొట్టాల తండాలో రూ. 33 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మేనల్లుడు దేవినేని అవినాష్, పంచాయతీరాజ్ డీఈ, ఏఈతో కలిసి శనివారం పరిశీలించారు. ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్ సేవల్ని వినియోగించుకోండి

రాయదుర్గంరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డుల మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వం ఆధార్ అప్డేట్ కేంద్రాన్ని నిర్వహించనుందని ఎంపీడీఓ కొండన్న శనివారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 22 నుంచి 25 వ తేదీ వరకు ఆధార్ ఉచిత సేవలను అందించనున్నట్లు చెప్పారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేమకల్లు అంజన్నకు విశేషపూజలు


ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్ కుమార్‌చార్యులు వేకువజామునే మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పలు అభిషేకాలు చేశారు. అనంతరం వెండి కవచ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. రాయదుర్గం కోర్టు న్యాయాధికారి రమ్య స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలో అపులాపురం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే మల్లాపురం గ్రామ సమీపంలో ఉన్న విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ పూజలు పెద్దఎత్తున జరిగాయి. అర్చకులు ఆయా ఆలయాల్లో మూలవిరాట్‌లకు ఉదయమే ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు


స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

తాడిపత్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):చింతల వెంకటరమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం చక్రస్నానంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తికి సమీపంలోని కోనేటిలో చక్రస్నానం చేయించారు. బ్రహ్మోత్సవాలు చివరిరోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం

బొమ్మనహాళ్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలో శనివారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసరెడ్డి, స్థానిక పాఠశాల హెచ్‌ఎం రాజసూర్యుడు తొలుత ఈ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. తర్వాత పాఠశాల మైదానంలో బాలికలకు బెలూన్ క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీఎల్ వాసంతి తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు

బొమ్మనహాళ్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్, దేవగిరి గ్రామాల్లో శనివారం తహసీల్దార్ మునివేలు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా తలెత్తిన భూసమస్యలన్నింటినీ ఈ సభల్లో పరిష్కరిస్తామని తెలిపారు. భూ సమస్యలు రైతులు తమకు అర్జీలు ఇవ్వాలని సూచించారు. మండల సర్వేయర్ రవితేజ, వీఆర్వోలు నాగరాజురావు, యుగంధర్, టీడీపీ పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని చింతకుంట, చిన్నమల్లేపల్లి గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించినట్లు తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. ఇందులో భూ సమస్యలున్న పలువురి రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు.

రేపటి నుంచి గ్రామసభలు

బెళుగుప్ప: మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 21 నుంచి 22 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షర్మిల ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ ఉదయం ఆవులెన్న, మధ్యాహ్నం గుండ్లపల్లి, 22న ఉదయం కోనంపల్లి, మధ్యాహ్నం గంగవరం గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

కూడేరు: మండలంలో ఈ నెల 22వ తేదీన తిమ్మాపురం, ఎంఎంహళ్లి, 23న చోళసముద్రం గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు జరుగుతాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు దబ్బర ప్రసాద్‌ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యలున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్రా చైతన్య మృతికి ప్రముఖుల నివాళి

ఉరవకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు నర్రాకేశన్న కుమారుడు నర్రా చైతన్య బెంగళూరులో గత శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని శనివారం ఉరవకొండకు తీసుకొచ్చారు. రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ చైతన్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. తర్వాత నర్రాకేశన్నను ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అలాగే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నర్రాచైతన్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇంకా టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు రేగాటినాగరాజు, ప్రతాప్‌నాయుడు, సీతారాములు, మాజీ సర్పంలు గోవిందు, వెంకటేశులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని 1వ డివిజన్ వాటర్ ట్యాంక్ వద్ద శనివారం ఆయన కార్మికుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, యూని ఫాం, చెప్పులు ఇవ్వాలన్నారు. అలాగే పట్టణంలో పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్మికుల సమస్యలపై సంతకాల సేకరణ చేసి మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, ఎమ్మెల్యేకు వినతి పత్రాలను అందజేస్తామని తెలిపారు. సంఘం నాయకులు జగదీష్, నరసయ్య, రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, హనమంతు తదితరులు పాల్గొన్నారు.